రంగారెడ్డి | వికారాబాద్ | మేడ్చల్ వార్త

## అమ్మోరు తల్లి.. చల్లంగా చూడు భక్తిశ్రద్ధలతో బోనాల పండుగ



అమ్మోరుతల్లికి బోనాలు సమర్పించి మొక్కలు తీర్చుకున్న మహిళలు

**నందిగామ, జులై 21, ప్రభాతవార్త:** మహంకాళి అమ్మోరు తల్లి దీవెనలతో అందరూ చల్లంగా ఉండాలని సమృద్ధిగా వర్షాలు కురిసి పాడిపంటలు పిల్లాపాపలు సుఖసంతోషాలతో ఉండేలా దీవించమని భక్తిశ్రద్ధలతో ఆదివారం అమ్మోరు తల్లికి పూజలు నిర్వహించారు. మహిళలు అందంగా అలంకరించిన బోనాలను తలపై పెట్టుకుని ఊరేగింపుగా వెళ్లి అమ్మోరుతల్లికి నైవేద్యం పెట్టి మొక్కలు తీర్చుకున్నారు.

## ముదిరాజ్‌లను బిసి డి నుంచి బిసి ఏలోకి మార్చాలి

### ముదిరాజ్ సంఘం జిల్లా అధ్యక్షుడు జీ.శ్రీనివాస్

**పెద్దేముల్, జులై 21, ప్రబాతవార్త:** ముదిరాజ్‌లను బీసీ డి నుంచి బీసీ ఏ లోకి మార్చాలని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు జీ.శ్రీనివాస్, యువజన విభాగం అధ్యక్షుడు లొంక నర్సిములు విజ్ఞప్తి చేశారు, ఈ మేరకు ఆదివారం అసెంబ్లి స్వీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్, యంపి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి,తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డికి వినతి పత్రం అందజేశారు. స్పందించిన ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి ఈ విషయాన్ని అసెంబ్లిలోప్రస్తావిస్తానని హమి ఇవ్వడం జరిగిందని అన్నారు. వినతి పత్రం అందజేసిన వారిలో జిల్లా మత్స్యకార సంఘం చైర్మెన్ శ్రీధర్, ఉపాద్యాక్షులు శాకంరాములు, యాలాల్ మండల్, తాండూరు పట్టణం అధ్యక్షులు హన్మంతు, శ్రీకాంత్, యాలాల్, పెద్దేముల్, తాండూరు మండలాల యువజన విబాగం అధ్యక్షులు తిరుపతి, లొంక రాములు, జగదీష్, నాయకులు బంటు వేణు, రాము, సురేష్, మహేష్, బందెప్ప, శ్రీను,పట్నం రామక్రిష్ణ, తడకల ప్రవీన్, వికారా బాద్, పరిగి, తాండూరు నియోజకవర్గాల ముదిరాజ్ సంఘ సభ్యులు పాల్గొన్నారు.

## మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లా అదనపు కలెక్టర్‌గా రాధికాగుప్త

**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, జులై 21, ప్రభాతవార్త**

మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లా అదనపు కలెక్టర్‌గా రాధికాగుప్త (ఐఏఎస్) నియమితులయ్యారు. రాష్ట్ర ప్రభుత్వం పలువురు ఐఏఎస్ అధికారుల బదిలీలలో భాగంగ ఆమె మేడ్చల్ జిల్లాకు నియమితులయ్యారు. మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లా అదనపు కలెక్టర్ రాధికాగుప్త (స్థానిక సంస్థల)ను రాష్ట్ర ప్రభుత్వం నియమించటంతో ఆమె సోమవారం మేడ్చల్ కలెక్టరేట్‌లో భాధ్యతలు స్వీకరించే అవకాశం ఉన్నట్లు సమాచారం. మేడ్చల్ జిల్లా అదనపు కలెక్టర్‌గా అభిషేక్ ఆగస్త్య కొనసాగి ఇటీవలనే ఖమ్మం మున్సిపల్ కమిషనర్‌గా బదిలీ కావటంతో ఖాళీ ఏర్పడింది. అయితే హన్మకొండ జిల్లా అదనపు కలెక్టర్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్న రాధికాగుప్తను మేడ్చల్ జిల్లా అదనపు కలెక్టర్‌గా నియమిస్తూ ప్రభుత్వం శనివారం సాయంత్రం ఉత్తర్వులు జారీ చేయటం జరిగింది. జిల్లా అదనపు కలెక్టర్‌గా (స్థానిక సంస్థల) నియమితులైనందున రాధికాగుప్త ఇక విచ్చేసి బాధ్యతలు చేపట్టనున్నారు.

## చిలుకూరు బాలాజీని దర్శించుకున్న ఆర్మీ మేజర్ జనరల్ అచలేష్‌కుమార్



**మొయినాబాద్,జులై 21, ప్రభాతవార్త** ఆర్మీ మేజర్ జనరల్ అచలేష్‌కుమార్ ఝూ చిలుకూరు బాలాజీని దర్శించుకున్నారు. బైసన్ డివిజన్ ఆర్మీ మేజర్ జనరల్ అచలేష్ కుమార్ ఝూ కుటుంబ సభ్యులతో కలిసి ఆదివారం మొయి నాబాద్ మండల పరిధిలోని చిలుకూరు బాలాజీ దేవాలయానికి వచ్చారు. ఆలయ అర్చకులు రంగరాజన్ వారికి స్వాగతం కలికారు. ఆలయం చుట్టూ ప్రదక్షణలు చేసి గర్భగుడిలోకి వెళ్లి స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు రంగరాజన్ వారికి ఆలయ విశిష్టతను తెలియజేశారు. స్వామివారి పూలమాలతో వారికి ఆశీర్వాధం అందజేశారు. అనంతరం ఆలయ ప్రాంగణంలోని శివాలయంలో సుందరేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు చేశారు.

## శ్రీసాయిబాబా ఆలయంలో మాజీ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి పూజలు



ఆలయంలో పూజలు చేస్తున్న మంచిరెడ్డి కిషన్‌రెడ్డి

**ఆదిభట్ల,జులై 21, ప్రభాతవార్త** గురుపౌరమిని పురస్కరించుకుని ఇబ్రహీం పట్నం నియోజకవర్గం మాజీ ఎమ్మెల్యే మంచి రెడ్డికిషన్‌రెడ్డి ఆదివారం ఆదిభట్ల మున్సిపాలిటీ పరిధిలోని కొంగరకలాన్‌లోని శ్రీసాయిబాబా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గురుపౌర్ణమి రోజు సాయిబాబాను దర్శించుకోవడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. సాయిబాబా ఆశీస్సులతో ఇక్కడి మున్సిపాలిటీతోపాటు నియోజకవర్గం కూడా అభివృద్ధిలో ముందుకు సాగాలని కోరుకుంటున్నాని అన్నారు. అంతే కాకుండా ప్రజలందరూ ఆయురారోగ్యాలతో ఉండాలని, స్వామివారి ఆశీస్సులు ప్రతిఒక్కరిపై ఉండాలని అన్నారు. గురు పౌర్ణమికి తోడు ఆదివారం కావడంతో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## యాచారంలో గురుపౌర్ణమి వేడుకులు

**యాచారం,జులై 21, ప్రభాతవార్త** యాచారం మండల పరిధిలోని మాల్ గ్రామంలో ఆదివారం గురుపౌర్ణమిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణంలో రుద్రాభిషేకం సూర్యపాశుపతం హోమం, వీరవెంకట రమా సహిత సత్యనారాయణ స్వామి వ్రతం, అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమం వందనపు లీలావతి వ్యవస్థాపకురాలు మేనేజింగ్ ట్రస్టు పప్పు వెంకట శివకుమార్ కాశ్యపన్ ఆధ్వర్యంలో నిర్వహించారు. గ్రామస్తులు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## ఆత్మరక్షణకు కరాటే మంచి సాధనం

### మేడ్చల్ ఏసిపి శ్రీనివాస్‌రెడ్డి

**మేడ్చల్, జులై 21. ప్రభాతవార్త :** ఆత్మ రక్షణకు కరాటే ఓ మంచి సాధనమని మేడ్చల్ ఏసిపి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మేడ్చల్ పట్టణంలోని కేఎల్‌ఆర్ వెంచర్‌లో యూనివర్సల్ 369 చోటాకాన్ కరాటే ఆధ్వర్యంలో కరాటే విద్యార్థులకు బెల్టుల ప్రధానోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి విచ్చేసిన ఏసిపి ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆత్మరక్షణతో పాటు శారీరక దారుఢ్యానికి కరాటే అవసరమని, ప్రతి తల్లి దండ్రి తమ పిల్లకు కరాటే నేర్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కేఎల్‌ఆర్ వెంచర్ అధ్యక్షుడు నరేందర్, కరాటే శిక్షకుడు సాయికుమార్, కోచ్‌లు అక్షయ, వరుణ్ తేజ్, మున్నా కుమార్, విద్యార్థులు పాల్గొన్నారు.



విద్యార్థులకు బెల్టులు ప్రధానం చేస్తున్న ఏసిపి శ్రీనివాస్‌రెడ్డి

# ఘనంగా బోనాల పండుగ

## పాల్గొన్న కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, ప్రకాష్‌గౌడ్,కార్తీక్‌రెడ్డి



**శంషాబాద్,జులై 21, ప్రభాతవార్త** ప్రతి ఏటా ఆషాడ మాసంలో నిర్వహించే తెలంగాణ సంప్రదాయబద్ధమైన బోనాల వేడుకలను శంషాబాద్‌లో ఆదివారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. మధురానగర్ ఆర్‌బినగర్ సిద్ధాంతి పోచమ్మగడ్డ కాపుగడ్డ యాదవ బస్తి రాల్లగూడ ఎయిర్‌పోర్టుకాలనీ తదితర బస్తీలలో బోనాల వేడుకలను అత్యంత వైభవంగా నిర్వహించారు. ఒకవైపు ఉదయం నుంచి వర్షం కురుస్తున్నా భక్తులు మాత్రం దానిని లేక్క చేయకుండా తలపై బోనాలు ఎత్తుకుని అమ్మవారికి సమర్పించారు. శంషాబాద్‌లో జరిగిన బోనాల వేడుకలకు చేవెళ్ల పార్లమెంట్ సభ్యుడు కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్, టిఆర్ఎస్ పార్టీ రాష్ట్రనాయకుడు పట్లోళ్ల కార్తీక్‌రెడ్డి మైలార్దేవ్‌పల్లి కార్పొరేటర్ తోకల శ్రీనివాస్‌రెడ్డి శంషాబాద్ మున్సిపల్ చైర్మన్ కొలను సుష్మామహేందర్‌రెడ్డి గణేష్ గుప్తా దూడల వెంకటేష్ గౌడ్ తదితరులు ప్రత్యేకంగా అమ్మవారిని దర్శించుకుని పూజా కార్యక్రమాలు నిర్వహించారు. మధురానగర్ పోచమ్మ దేవాలయ కమిటీ సభ్యులు స్థానిక స్రవంతి శ్రీకాంత్‌రెడ్డి సింగిల్ విండో చైర్మన్ ముద్దం మల్లారెడ్డి కో ఆప్షన్ మెంబర్ కవిత ప్రసాద్ దేవేందర్ రెడ్డి, తోట రాములు జిల్లపల్లి శ్రీనివాస్ సంతోష్‌రెడ్డి మునగాల రాజిరెడ్డి ఈదుల నరిసింహగౌడ్ గాజుల రాజు తదితరులు పాల్గొన్నారు.

### శామీర్‌పేటతోపాటు పలు గ్రామాల్లో..

**శామీర్‌పేట, జులై 21, ప్రభాతవార్త** శామీర్‌పేట, మూడుచింతలపల్లి మండలాల్లోని పలు గ్రామాల్లో ఆదివారం బోనాల పండు గను ప్రజలు ఘనంగ జరుపుకున్నారు. శామీర్‌పేట మండలంలోని శామీర్‌పేట, అలియా బాద్, లాల్‌గడిమలక్‌పేట్, బాబగూడ, బొమ్మరాసిపేట్, పొన్నాల్ గ్రామాల్లో బోనాల పండుగను ప్రజలు ఘనంగ జరుపుకున్నారు. అదే విధంగ మూడుచింతలపల్లి మండలం లోని లక్ష్మాపూర్, జగ్గంగూడ, ఉద్దెమర్రి గ్రామాల్లో ప్రజలు బోనాల పండుగను ఘనంగ జరుపుకున్నారు. ఆయా గ్రామాల్లో శ్రీమహంకాళి, ముత్యాలమ్మ, పోచమ్మ, ఎల్లమ్మ, దుర్గమ్మ, పలు అమ్మవార్లకు బోనాలు చేసి మహిళలు బోనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. శామీర్‌పేట, మూడుచింతలపల్లి మండలాల్లోని వివిధ గ్రామాల్లో అమ్మవార్ల ఆలయాలను బోనాల పండుగ సందర్భంగ ముస్తాబు చేశారు. భారీ సంఖ్యలో భక్తులు పాల్గొని అమ్మవార్లను దర్శించుకున్నారు. గ్రామాల్లో బోనాల పండుగ సందర్భంగ ఆటపాటలతో భక్తి పారవశ్యంతో ఉండి అమ్మవార్లను భక్తులు దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు ఎస్.హరివర్ధన్‌రెడ్డి, శామీర్‌పేట మండల కాంగ్రెస్ అధ్యక్షులు వై.శంకర్‌గౌడ్, తూంకుంట మున్సిపల్ కాంగ్రెస్ అధ్యక్షులు బి.జైపాల్‌రెడ్డి, జిల్లా కాంగ్రెస్ నాయకులు ఎం.మహేందర్‌యాదవ్, వై.నాగేశ్వర్‌గౌడ్, బి.రాంచందర్‌యాదవ్, ఆంజనేయులు, రాజు, రాందాసు, ఆనంద్‌గౌడ్, మల్లేశ్, పలువురు నాయకులు, కార్య కర్తలు, భక్తులు పాల్గొన్నారు. డిసిసి అధ్యక్షులు హరివర్ధన్‌రెడ్డిని పలు గ్రామాల్లో సన్మానిం చారు. అదే విధంగ వివిధ పార్టీల నాయకులు, భక్తులు బోనాల పండుగ సందర్భంగ అమ్మవార్లను దర్శించుకున్నారు. ఆయా గ్రామాల మాజీ ప్రజాప్రతినిధులు, నాయకులు, గ్రామాల పెద్దలు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.





ప్రముఖ నాయకులను సన్మానిస్తున్న బీజేపీ, కాంగ్రెస్ నాయకులు



శామీర్‌పేటలో బోనాల పండుగ సందర్భంగ అమ్మవారిని దర్శించుకున్న డిసిసి అధ్యక్షులు హరివర్ధన్‌రెడ్డి, పాల్గొన్న కాంగ్రెస్ నాయకులు

# కన్నుల పండువగా అనంతుడి పెరుగు బసంతోత్సవం



హనుమద్ వాహనంపై ఊరేగుతున్న శ్రీ అనంత పద్మనాభ స్వామి, పెరుగు బసంతోత్సవం తిలకించేందుకు వచ్చిన భక్తులు

**వికారాబాద్,జులై 21, ప్రభాతవార్త:** ఆషాడ మాస చిన్న జాతర ఉత్సవాల్లోని ప్రధాన ఘట్టమైన శ్రీ అనంత పద్మనాభ స్వామి పెరుగు బసంతోత్సవం ఆదివారం ఎంతో కన్నుల పండుగగా జరిగింది. అనంతగిరిలోని శ్రీ అనంత పద్మనాభ స్వామి ఆలయానికి పెరుగు బసంతోత్సవాన్ని పురస్కరించుకున్న భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. వర్షాన్ని సైతం లెక్క చేయకుండా పెరుగు బసంతోత్సవం కార్యక్రమంలో భక్తులు పాల్గొన్నారు. ముందుకు స్వామి వారిని ఆలయ కోనేటి వద్దకు మంగళవాయిద్యాలతో ఆలయ అర్చకులు ఊరేగింపుగా తీసుకెళ్ళి మంగళ స్నానాలు చేయించారు. అనంతరం ఆలయ మాడ వీధుల్లో స్వామివారిని హనుమద్ వాహనంపై ఊరేగించారు. అనంతరం ఆలయ ధ్వజ స్థంభం వద్దకు స్వామి వారు చేరుకోగానే ఆలయ సిబ్బంది పెరుగు బసంతం కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ ఉత్సవాన్ని తిలకించేందుకు భక్తులు వేల సంఖ్యలో తరలివచ్చారు. పెరుగు బసంతం ఉత్సవ ప్రసాదాన్ని స్వీకరించేందుకు భక్తులు పోటీ పడ్డారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పట్టణ పోలీసులు గట్టి బందోబస్తు నిర్వహించి భక్తులను అదుపు చేశారు. అనంతరం భక్తులు క్యూలైన్లో వేచి ఉండి స్వామి వారిని దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు శేషగిరి పంతులు, పద్మనాభం, ఆలయ అధికారులు శాంతకుమార్, ప్రజా ప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

### ప్రతి ఒక్కరు దైవభక్తి కలిగియుండాలి

### ఆలయ కమిటీ నిర్వహకులు రవిందర్‌రెడ్డి

**పెద్దేముల్, జులై 21, ప్రభాతవార్త:** ప్రతి ఒక్కరు దైవభక్తి కలిగియుండాలని పాండురంగస్వామి ఆలయ కమిటి నిర్వహకులు రవిందర్‌రెడి, సంజీవరెడ్డి అన్నారు. ఆదివా రం గురుపౌర్ణమిని పురస్కరించుకొని పెద్దేముల్ మండంలోని జనగాంలో ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ మేరకు పాండురంగస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అంతకుముందు పాండురంగస్వామిని పల్లకిలో పురవీదుల గుండా ఊరెగింపుగా వెళ్ళి పెరుగు బసంతం నిర్వహించారు. ఉత్సవాలలో బాగంగా 24 గంటల పాటు భజన సంకీర్తనలు నిర్వహించారు. అనంతరం అన్నదానం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మా ట్లాడుతూ ప్రతిఒక్కరు దైవచింతన కలిగియుండాలని, తద్వారా సుఖశాంతులు లభిస్తాయని అన్నారు. పరమాత్ముని సేవలో ప్రతి ఒక్కరుపాల్గొని స్వామి కృపకు పాత్రులు కాగలరని విన్నవించారు.



జనగాంలో పెరుగు బసంతం నిర్వహిస్తున్న భక్తులు



ఆలయంలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

## షాద్‌నగర్‌లో ఘనంగా గురుపౌర్ణమి

### హాజరైన ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ, మాజీ ఎమ్మెల్యే

**షాద్‌నగర్, జులై 21, (ప్రభాతవార్త) :** షాద్‌నగర్ పట్టణ కేంద్రంలోని సాయిబాబా ఆలయంలో ఆదివారం గురుపౌర్ణమి వేడుకలను అంగరంగ వైభవంగా నిర్వహించారు. వేకువజాము నుంచే ఆలయంలో భక్తులకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ గురు పౌర్ణమి సందర్భంగా షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, ఎమ్మెల్సీ నవీన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే అంజయ్యయాదవ్ తదితర నాయకులు వేర్వేరుగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు వారిని పూలమాల, శాలువలతో ఘనంగా సత్కరించి స్వామివారి ఆశీస్సులు అందజేశారు. ఈ సందర్భంగా వారు భక్తులనుద్దేశించి ప్రసంగిస్తూ.. ప్రతి ఒక్కరూ సమాజంలో ఆధ్యాత్మిక సేవలతో తరించాలని తద్వారా పుణ్యం, పురుషార్థం లభిస్తాయని అన్నారు. ప్రతి ఏటా ఆలయంలో ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహిస్తు భక్తులకు అన్నదానం చేయడం అభినందనీయమని వారు ఆలయ కమిటీ సభ్యులను అభినందించారు. అనంతరం ఆలయంలో భక్తులకు వస్త్రాలను పంపిణీ చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమంలో ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, ఎమ్మెల్సీ నవీన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే అంజయ్యయాదవ్‌లు భక్తులకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు విజయ్ కుమార్, లయన్ కమ్మదనం సుధాకర్, మాజీ కౌన్సిలర్ లతా శ్రీశైలంగౌడ్, కాంగ్రెస్ సీనియర్ నేతలు చెంది తిరుపతిరెడ్డి, బాబర్‌ఖాన్, కౌన్సిలర్ మహేశ్వరి, మాజీ కౌన్సిలర్ విజయ్‌కుమార్‌రెడ్డి, అందెమోహన్, వెంకట్‌రాంరెడ్డి, కిరణ్, చంద్రశేఖర్‌రెడ్డి, క్రాంతి కుమార్ పట్టణ పురప్రముఖులు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



భక్తులకు వస్త్రాలను పంపిణీ చేస్తున్న మాజీ ఎమ్మెల్యే అంజయ్యయాదవ్

## పోగొట్టుకున్న మొబైల్ ఫోన్ అందజేత

**బొంరాస్‌పేట్,జులై21,ప్రభాతవార్త :** పొగొట్టుకున్న మొబైల్ ఫోన్‌ను సీఈఐఆర్ ద్వార గుర్తించడం జరిగిందని ఎస్ఐ ఎండి అబ్దుల్ రాహుఫ్ తెలిపారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సీఈఐఆర్ పోర్టల్ ద్వార మండల పరిధిలోని రేగడిమైలారం గ్రామంలో బషీరాబాద్ మండలంకు చెందిన నర్యానాయక్ తన మొబైల్‌ఫోన్‌ను పొగొట్టుకోవడం జరిగింది.మొబైల్‌ఫోన్‌ను తిరిగి బాధితుడికి అందజేయడం జరిగిందని ఎస్ఐ తెలిపారు.ఎఎస్ఐ కమల్‌రెడ్డి,పోలీస్‌స్బింది పాల్గొన్నారు.

## కుక్కల దాడిలో లేగదూడ మృతి



**జిల్లెడు చౌదరిగూడ, జులై 21,(ప్రభాతవార్త):** కుక్కలదాడిలో లేద దూడ మృతి చెందిన సంఘటన జిల్లెడు చౌదరిగూడ మండలంలోని తూంపల్లి గ్రామంలో చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన బోయ అంజనేయులు తన లేగదూడపై కుక్కలు దాడి చేసినట్లు తెలిపారు. కుక్కలు దాడి చేయడంతో లేగదూడ మృతి చెందదినట్లు ఆయన వివరించారు. ప్రభుత్వం స్పందించి తనను ఆదుకోవాలని ఆయన కోరారు.

## రైతు భరోసా ఎగ్గొట్టినందుకా సంబరాలు?

**బొంరాస్‌పేట్,జులై21,ప్రభాతవార్త :** రైతులకు ఇవ్వాల్సిన రైతు భరో సాను ఎగ్గొట్టినందుకు కాంగ్రెస్‌పార్టీ నాయకులు సంబరాలు నిర్వహిస్తు న్నరా అంటూ కొడంగల్ నియోజకవర్గం బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ మడిగే శ్రీని వాస్ అన్నారు.ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ ఏం సాధించారని సంబరాలు చేసుకుంటున్నారని,పంటపెట్టుబడి కోసం రైతులకు ఇవ్వాల్సిన రైతుభరోసా డబ్బులను ఎగ్గొట్టినందుక రుణమాఫీ అమలులో కోతలుపెట్టి కొంతమంది రైతులకు మాత్రమే రుణామాఫీ చేసి మిగత రైతులను మోసం చేసినందుకా లేక పంటనష్టపరిహారం ఇవ్వకుండా రైతులకు ఇబ్బందులు పెట్టినందుకు ఈ సంబరాలు చేసు కుంటున్నారా అంటూ అయన ప్రభుత్వా న్ని ప్రశ్నించారు. రాష్ట్రస్థాయి బ్యాంకర్ల సమావేశంలో రైతులు తీసుకున్న రుణాలు 64వేల కోట్ల కుపైగ ఉన్నాయని అందులో 10శాతం రుణాలను మాఫీ చేసి సంబరాలు చేసుకోవడం హస్యాస్పదంగా ఉందన్నారు.

## వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డు సాధించిన ప్రిన్సిపాల్



**కొడంగల్ రూరల్, జులై 21 (ప్రభాత వార్త):** వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డులో కొడంగల్ పట్టణంలోని నవీన ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ డివి.నరేశ్‌రాజ్ చోటు దక్కించుకున్నారు. ఆదివారం గురుపూజోత్సవం సందర్భంగా వ్యాసమహర్షి జయంతిని నిర్వహించారు. గురుపూజోత్సవం సందర్భంగా ఆన్‌లైన్‌లో వండర్ బుక్ ఆఫ్ రికార్డులో తనకు స్థానం దక్కినట్లు ఆయన తెలిపారు. ఉన్నత చదువులు చదివి విద్యార్థులకు ఉన్నతమైన చదువులు అందించడంతో తనకు వర్తి వెల్నెస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో విశ్వరత్న అవార్డును అందించడం జరిగిందని తెలిపారు. ఈ సందర్భంగా ఆయనకు కుటుంబ సభ్యులు, స్నేహితులు శుభాకాంక్షలు తెలిపారు.



బోనాల ఉత్సవాలలో పాల్గొన్న మంత్రి పొన్న ప్రభాకర్ తదితరులు

## బోనాల ఉత్సవాలలో పాల్గొన్న మంత్రి

**కంటోన్మెంట్, జూలై 19 ప్రభాతవార్త :** గౌడ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు, కాంగ్రెస్ నేత పల్లే లక్ష్మణ్‌రావు గౌడ్ ఆధ్వర్యంలో మారేడ్‌పల్లి లో జరిగిన బోనాల ఉత్సవాలలో మంత్రి పొన్నం ప్రభాకర్, ఎంపీ అనిల్ కుమార్‌యాదవ్, ఎమ్మెల్యే శ్రీగణేష్, ఎంపి వి. హనుమంతరావు, మహిళా కమిషన్ చైర్మన్ శారద, ఎస్.సత్యనారాయణ, చైర్మన్ శ్రీకాంత్ పాల్గొన్నారు.

### వైభవంగా జాంబాగ్ బాలానంద సంఘం షష్ట్యబ్ది ఉత్సవాలు

**రవీంద్రభారతి, జూలై 21 ప్రభాతవార్త :** రాష్ట్ర ప్రభుత్వం భాషా సాంస్కృతికశాఖ, జాంబాగ్ బాలానంద సంఘం సంయుక్త ఆధ్వర్యంలో సంఘం 60ఏళ్లు పూర్తిచేసుకున్న సందర్భంగా షష్ట్యాబ్ది ఉత్సవాలను నిర్వహించుకొంటున్నట్లు అధ్యక్షుడు మద్దిపట్ల వెంకటభాస్కర్ తెలిపారు. రేడియో అన్నయ్య, అక్కయ్యలు న్యాయపతి రాఘవయ్య, కామేశ్వరిల ప్రోద్భలంతో మద్దిపట్ల వెంకట్రావు 1962లో జాంబాగ్‌లో బాలానంద సంఘాన్ని వ్యవస్థాపించడం జరిగిందన్నారు. ఈ నెల 23న రవీంద్రభారతి ప్రధాన మందిరంలో ఉదయం 10గంటల నుండి జరిగే ఈ ఉత్సవాల్లో ముందుగా బాలబాలికలకు సెమీ క్లాసికల్ డ్యాన్స్, ఏకపాత్రాభినయం, నాటక రంగాల్లో పోటీలు నిర్వహిస్తామని తెలిపారు. అనంతరం బాలానంద బాలబాలికలచే కూచిపూడి నృత్యప్రదర్శన; బాలానందం పాటలు,మద్దిపట్ల వెంకట్రావు రచించిన భక్తధ్రువ నాటకం ప్రదర్శింపబడతాయని వివరించారు. చివరిగా జరిగే సభాకార్యక్రమంలో ముఖ్యఅతిథిగా తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతికశాఖ సంచాలకుడు డా. మామిడి హరికృష్ణ ముఖ్యఅతిథిగా, మద్దాళి రఘురామ్, చొక్కపు వెంకటరమణ గౌరవ అతిథులుగా పాల్గొని పోటీ విజేతలకు బహుమతులను, ప్రముఖ సినీనటుడు, దర్శకుడు అశోక్‌కుమార్‌కు మద్దిపట్ల వెంకట్రావు స్మారక పురస్కారం ప్రదానం చేస్తారని వెంకట భాస్కర్ వివరించారు. ఈ కార్యక్రమంలో అధికసంఖ్యలో బాలబాలికలు పాల్గొని, విచ్చేసి విజయవంతం చేయాలని కోరారు.

## జ్ఞానేశ్వర్‌కు ఘన సత్కారం




జ్ఞానేశ్వర్‌ను, నార్సింగి మున్సిపల్ నూతన పాలకవర్గంను సన్మానిస్తున్న ముదిరాజ్ సంఘం సభ్యులు

**నార్సింగి, జూలై 21 ప్రభాతవార్త :** రాష్ట్ర ముదిరాజ్ కో ఆపరేటివ్ సొసైటీ కార్పొరేషన్ చైర్మన్ జ్ఞానేశ్వర్‌ను, నార్సింగి మున్సిపల్ నూతన పాలకవర్గంను మంచిరేవుల ముదిరాజ్ సంఘం ప్రతినిధులు ఘనంగా సత్కరించారు. జ్ఞానేశ్వర్‌తోపాటు మున్సిపల్ చైర్‌పర్సన్ నాగపూర్ణ శ్రీనివాస్, వైస్ ఛైర్మన్ విజయ్‌బాబు, కౌన్సిలర్లు పద్మ వీరారెడ్డి, శివారెడ్డి, పత్తిప్రవీణ్, సునీత గణేష్, ఉషారాణిలను ఆదివారం ముదిరాజ్ సంఘం భవన్‌లో పుష్పగుచ్ఛాలిచ్చి, శాలువాలతో సన్మానం చేశారు. ఈ సందర్భంగా జ్ఞానేశ్వర్ ముదిరాజ్ మాట్లాడుతూ ముదిరాజ్ కులస్థులు రాష్ట్ర జనాభాలో అత్యధికులున్నారని, వీరి సంక్షేమం కోసం సీఏం రేవంత్‌రెడ్డి ప్రత్యేక కార్పోరేషన్‌ను ఏర్పాటు చేయడం ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపిపి మల్లేష్ ముదిరాజ్, మాజీ వైస్ ఎంపిపి పాపిరెడ్డి, కాంగ్రెస్ అధ్యక్షులు అశోక్ యాదవ్, మాజీ సర్పంచ్‌లు ప్రవీణ్ యాదవ్, గండయ్య, ఆంజనేయులు, సీనియర్ నాయకులు దశరత్, యాదగిఇ, అశోక్‌రెడ్డి, యాదయ్య, మాధవరెడ్డి, శ్రీరాములు, శ్రీనివాస్, నర్సిహ్మ, శివరాజ్, క్రాంతి పాల్గొన్నారు.

## మొక్కలు నాటి పర్యావరణాన్ని పరిరక్షించాలి

**- బండ్లగూడ జాగీర్ కార్పొరేషన్ మేయర్ లతాప్రేమ్‌గౌడ్**



మొక్కలు పంపిణీ చేస్తున్న మేయర్ లతాగౌడ్ దృశ్యం

**నార్సింగి, జూలై 21 ప్రభాతవార్త :** ప్రజలు స్వచ్ఛందంగా మొక్కలు నాటి, పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములు కావాలని బండ్లగూడ జాగీర్ కార్పొరేషన్ మేయర్ మద్దెల లతాప్రేమ్‌గౌడ్ పేర్కొన్నారు. ఆదివారం వన మహోత్సవంలో భాగంగా కార్పోరేషన్‌ని 8వ వార్డు పరిధిలో కార్పొరేటర్ భూపాల్‌గౌడ్‌తో కలిసి మేయర్ మొక్కలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సీఏం రేవంత్‌రెడ్డి వన మహోత్సవం కార్యక్రమానికి పెద్దపీట వేసి, రాష్ట్ర వ్యాప్తంగా కోట్లాది మొక్కలను నాటింప చేస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో అశోక్‌రెడ్డి, శైలజ, వెంకటేష్, నాగేశ్వర్‌రెడ్డి, చక్రధర్ రెడ్డి, ప్రేమ్‌కుమార్, రాజ్‌కుమార్, కిరణ్ బుడ్డి, తిరుపతిరెడ్డి పాల్గొన్నారు.

## షిర్డీ సాయిబాబా ఆలయంలో గురుపౌర్ణమి

**యూసుఫ్‌గూడ, జూలై 21, ప్రభాతవార్త :** గురుపౌర్ణమి సందర్భంగా స్నేహపూరి కాలనీలోని షిర్డి సాయిబాబా దేవాలయంలో ఉదయం నుంచే భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.షిర్డి సాయి సేవా సంఘం ఆధ్వర్యంలో సాయిబాబాకు ఘనంగా పూజలు నిర్వహించగా మాకూరి లక్ష్మణ్ శ్రీనువాస్ దంపతుల ఆధ్వర్యంలో పెద్దఎత్తున అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయచైర్మన్ కళారత్న,ఎస్.ఎమ్.పిరాణ్,దశరథ్, స్నేహపూరి కాలనీ అధ్యక్షులు వినోద్ యాదవ్, వవెంకటేశన్వర్‌రెడ్డి, శర్మరెడ్డి, సివి ప్రసాద్, ఎల్ల సత్యం, రమేష్, వసీం, తదితరులు పాల్గొన్నారు.

### వివేకానందనగర్ కాలనీలో...

**యూసుఫ్‌గూడ, జూలై 21, ప్రభాతవార్త :** గురుపూర్ణిమి సందర్భంగా వివేకానందనగర్ కాలనీలో షిర్డి సాయిబాబా దేవాలయంలో ఉదయం నుంచే భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు పెద్ద ఎత్తున అన్నదాన కార్యక్రమం జరిగింది. ఈకార్యక్రమంలో సుజాత, బి.నిక్లేష్, లోహిత లక్ష్మీ, యమ్.ఎస్.వి చైతన్య, మాస్టర్ విక్రిష్ తదితరులు పాల్గొన్నారు.

### ప్రముఖులకు శాంతా వసంతా ట్రస్టు సాహితీ పురస్కారాలు

**నాంపల్లి, జూలై 21 ప్రభాతవార్త :** పద్మభూషణ్ పురస్కార గ్రహీత, శాంతా బయోటెక్ వ్యవస్థాపకుడు డా. కె.ఐ.వరప్రసాద్‌రెడ్డి ఆధ్వర్యంలోని శాంతా వసంతా ట్రస్టు 2024 సంవత్సరానికిగాను సాహితీ పురస్కారాలను ప్రకటించింది. ప్రముఖ రచయిత, కాలమిస్టు ఎం.వి.ఎస్.ప్రసాద్‌కు డా. వరప్రసాద్‌రెడ్డి ఉత్తమ సాహితీవేత్త పురస్కారం, ప్రముఖ అన్నమయ్య సాహితీ పరిశోధకుడు గంధం బసవ శంకరరావుకు కోడూరు వెంకటరమణారెడ్డి సాహితీ సేవారత్న పురస్కారంలకు ఎంపికయ్యారు. ఈ పురస్కారాలను బొగ్గులకుంట సారస్వత పరిషత్తులోని డా. దేవులపల్లి రామానుజరావు కళామందిరంలో ఆగస్టు 3 శనివారం రాత్రి 6గంటల నుండి జరిగే సభలో ప్రముఖ అతిథుల చేతులమీదుగా ప్రదానం చేస్తారని, ఇరువురికి పురస్కారంతోపాటు లక్ష రూపాయల నగదు, శాలువా, జ్ఞాపిక, ప్రశంసాపత్రంతో సత్కరిస్తారని ట్రస్టు పేర్కొంది.



ప్రత్యేక పూజల్లో పాల్గొన్న జంపన ప్రతాప్



గురు పౌర్ణమి వేడుకల్లో పాల్గొన్న ఈటెల రాజేందర్



సాయిబాబాకు పూజలు నిర్వహిస్తున్న మేయర్



గురు పౌర్ణమి వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే వివేకానంద్



వేడుకల్లో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్



బాగ్‌లింగంపల్లిలో..ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠాగోపాల్



ప్రత్యేక పూజల్లో పాల్గొన్న ప్రముఖులు



జిటియస్ కాలనీలో...

# వాడవాడల ఘనంగా గురు పౌర్ణమి వేడుకలు



సాయబాబాకు పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే వివేకానంద

**కంటోన్మెంట్, జూలై 19 ప్రభాతవార్త :** గురు పౌర్ణమి సందర్భంగా బోయిన్‌పల్లిలోని సాయిబాబా ఆలయంలో కంటోన్మెంట్ మాజీ ఉపాధ్యక్షుడు జంపన ప్రతాప్ ప్రత్యేక పూజలు జరిపారు. ఈ సందర్భంగా జంపన ప్రతాప్ మాట్లాడుతూ తమ జీవితానికి మార్గ నిర్దేశం చేసి మంచి మార్గాన్ని నడిపించేవారేవరైనా గురువుతో సమానమని అన్నారు. ఈ కార్యక్రమంలో టెంపుల్ కమిటీ సభ్యులు పూర్ణా, టింకుగౌడ్, మహావీర్ తదితరులు పాల్గొన్నారు.

**వివేకానందనగర్ సాయిబాబా మందిరంలో...**

**కెపిహెచ్‌బికాలనీ, జూలై 21, ప్రభాతవార్త:** కూకట్‌పల్లి వివేకానందనగర్‌లోని చిత్తారమ్మ ఆలయం ప్రాంగణంలో గల శ్రీ షిరిడి సాయినాథుని మందిరంలో ఆదివారం గురు పౌర్ణమి వేడుకలు వైభవంగా జరిగాయి. ఆలయ కమిటీ చైర్మన్, బీజేపీ రాష్ట్ర కార్యవర్గసభ్యులు వడ్డేపల్లి రాజేశ్వర రావు ఆధ్వర్యంలో జరిగిన గురు పౌర్ణమి ఉత్సవాలకు పరిసర ప్రాంతాల ప్రజలు పెద్దఎత్తున హాజరై సామూహిక వ్రతాలు, పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మల్కాజ్‌గిరి పార్లమెంట్ సభ్యులు ఈటెల రాజేందర్ ముఖ్య అతిథిగా పాల్గొని సాయిబాబాకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కూకట్‌పల్లి అసెంబ్లీ ఇంచార్జీ మాధవరం కాంతారావు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు హర్షనపల్లి సూర్యారావు, ఆలయ కమిటీ నిర్వాహకులు దర్శన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

**కుత్బుల్లాపూర్‌లో...**

**నిజాంపేట్, జూలై 21, ప్రభాతవార్త :** గురు పౌర్ణమి పర్వదినం సందర్భంగా మేయర్ కొలన్ నీలా గోపాల్ రెడ్డి ముఖ్య అతిథిగా విచ్చేసి శ్రీనివాసనగర్ కాలనీ, మధురా నగర్ ఆర్చ్ వద్ద శ్రీషిరిడి సాయిబాబా దేవాలయం, ప్రగతి నగర్, ఎన్ఆర్ఐ కాలనీలో ప్రగతీనగర్ సీనియర్ సిటిజన్ కల్చరల్ అసోసియేషన్ సభ్యుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గురు పౌర్ణిమి వేడుకల్లో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు ఆవుల పావని జగన్ యాదవ్, పైడి మాధవి, మహిళా నాయకురాలు సబిత జలంధర్‌రెడ్డి, సాంబశివరెడ్డి పాల్గొన్నారు.

**గురు పౌర్ణిమి వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే...**

**నిజాంపేట్, జూలై 21, ప్రభాతవార్త :** నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ప్రగతి నగర్ సీనియర్ సిటీజన్ కల్చరల్ అసోసియేషన్ సభ్యులు, నిజాంపేట్ శ్రీ షిరిడి సాయిబాబా ఆలయ కమిటీ సభ్యుల ఆహ్వానం మేరకు గురు పౌర్ణిమి సందర్భంగా సాయిబాబా దేవాలయంలో ఆదివారం పూజా కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే వివేకానంద, డిప్యూటీ మేయర్ ధనరాజ్ యాదవ్, ఎన్ఎంసి బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు రంగ రాయ ప్రసాద్, కార్పొరేటర్ మాధవితో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించారు.కార్యక్రమంలో కార్పొరేటర్లు బాలాజీ నాయక్, బి.దేవి, జి.సుజాత, కొలన్ సునీల్‌రెడ్డి, సాంబశివ రెడ్డి, శ్రీ షిరిడి సాయిబాబా మందిరం ఆలయ కమిటీ వ్యవస్థాపకులు ఏనుగుల సురేందర్‌రెడ్డి, కమిటీ సభ్యులు రాజశేఖర్‌రెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, జగన్‌మోహన్ పాల్గొన్నారు.

**గురు పౌర్ణిమి వేడుకల్లో పాల్గొన్న కొలన్ శ్రీనివాస్‌రెడ్డి**

**నిజాంపేట్, జూలై 21, ప్రభాతవార్త :** గురుపౌర్ణమి పర్వదినం సందర్భంగా ఆలయ చైర్మన్ కొలన్ శ్రీనివాస్ రెడ్డి ముఖ్య అతిథిగా విచ్చేసి రాజీవ్ గృహకల్ప శ్రీ షిరిడి సాయిబాబా ఆలయంలో ఆదివారం గురు పౌర్ణమి సందర్భంగా శ్రీ సాయిబాబాకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో పి.శ్రీనివాసరావు, ఏ.మధుసుదన్ రెడ్డి, బి.రమణబాబు, లక్ష్మణ్, నాయుడు, శ్రీనివాస్, కృష్ణం రాజు, ఎ.సత్య, ఎం.శ్రీనివాస్, వర్మరాజు, రామచంద్ర నాయక్, నరసింహాయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

**కుత్బుల్లాపూర్‌లో...**

**జీడిమెట్ల, జూలై 21, ప్రభాతవార్త :** కుత్బుల్లాపూర్‌లోని 130 సుభాష్‌నగర్ డివిజన్ సుభాష్‌నగర్, భాగ్యలక్ష్మీ కాలనీలో నిర్వహించిన గురు పౌర్ణమి వేడుకల్లో ఎమ్మెల్యే కేపీ వివేకానంద పాల్గొని సాయిబాబాకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ సురేష్ రెడ్డి, పోలే శ్రీకాంత్, ఎం.భాస్కర్‌రెడ్డి, సాగర్‌రెడ్డి, రాములు యాదవ్, మల్లేష్, బలరాంరెడ్డి, రఘు పాల్గొన్నారు.

**గురు పౌర్ణమి వేడుకల్లో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే...**

**జీడిమెట్ల, జూలై 21, ప్రభాతవార్త:** గురుపౌర్ణమి పర్వదినం సందర్భంగా మాజీఎమ్మెల్యే, కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు కూన శ్రీశైలంగౌడ్ సుభాష్ నగర్, మహాదేవపురం, ఐడీపీఎల్‌లోని శ్రీ సాయిబాబా ఆలయలలో నిర్వహించిన గురు పౌర్ణమి వేడుకల్లో శ్రీశైలంగౌడ్ పాల్గొని శ్రీ సాయిబాబాకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలందరిపై సాయి బాబా ఆశీస్సులు ఉండాలని ఆకాంక్షించారు.

**బాగ్‌లింగంపల్లి సాయిబాబా ఆలయంలో...**

**చిక్కడపల్లి, జూలై 21 ప్రభాతవార్త:** బాగ్‌లింగంపల్లి లోని షిరిడిసాయిబాబా దేవాలయంలో ఆదివారం గురు పౌర్ణమి వేడుకలను ఆలయం వ్యవస్థాపర వైస్‌చైర్మన్ పెదోళ్ల గంగారెడ్డి, ప్రధాన కార్యదర్శి ధర్మరాజుగౌడ్ ఆధ్వర్యంలో ఆదివారం నేత్రపర్వంగా నిర్వహించారు. కాకడ హారతి కార్యక్రమంతో గురుపౌర్ణమి వేడుకలు ప్రారంభం కాగా, అనంతరంచందనోత్సవం, అభిషేకం, సామూహిక సాయి వ్రతాలు, అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం పల్లకీసేవ, సాయి భజన జరిగింది. ఈ కార్యక్రమా ఆలయం నిర్మాణ కమిటీ ప్రతినిధులు రామ్మోహనరావు, మాజీ కార్పొరేటర్, బిఆర్ఎస్‌నేత వి.శ్రీనివాస్‌రెడ్డి, బిఆర్ఎస్ యువనేత ముఠాజైసింహా, మీడియా ఇంచార్జ్ ముచ్చకుర్తి ప్రభాకర్, జనార్దన్, గాంధీనగర్ బిఆర్ఎస్ అధ్యక్షుడు రాకేశ్ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

**బన్సీలాల్‌పేట్‌లో...**

**సికింద్రాబాద్, జూలై 21 ప్రభాతవార్త :** గురు పౌర్ణమి సంర్భంగా బన్సీలాల్‌పేట్ న్యూ బోయిగూడ సాయిబాబా ఆలయంలో ఆలయ చైర్మన్ బి. మహేష్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు జరిగాయి. బౌద్ధనగర్ డివిజన్ కార్పొరేటర్ కందిశైలజ పూజలు జరిపారు. వందలాధిగా భక్తులు పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో కరుణాకర్, లక్ష్మీనారాయణ, గోపి, సాయికృష్ణ, అశోక్, నర్సింగ్ తదితరులు పాల్గొన్నారు.

**జిఎస్‌టి కాలనీటలో...**

**యూసుఫ్‌గూడ, జూలై 21, ప్రభాతవార్త:** గురుపౌర్ణమి సందర్భంగా వెంగళరావునగర్ డివిజన్ పరిధిలోని జిటి యస్ కాలనీ శ్రీవీరాంజనేయ భవాని శంకర అయ్యప్ప స్వామి సాయిబాబా దేవాలయంలో ఘనంగా పూజలు నిర్వహించారు. ఉదయం నుంచే భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈసందర్భంగా సాయిబాబా దేవాలయంలో ఆలయ దేవదాయ ధర్మదాయ శాఖ చైర్మన్ చిన్నరమేష్ ఆధ్వర్యంలో మహాకుంభాభిషేకం నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో కమిటి సభ్యులు శ్రీ లక్ష్మీ, శ్రీనువాస్, వెంకటేశ్వర్లు, సత్యనారాయణ, దేవాలయ అర్చకులు దేవేందర్ శర్మ, లక్ష్మీనారాయణ, మూర్తి, నర్సింహ మూర్తి, ఫణీంద్ర శర్మ, మహేష్ శాస్త్రి శశికాంత్ పాండే, పాల్గొన్నారు.

## ఘనంగా బోనాల ఉత్సవాలు

**సికింద్రాబాద్, జూలై 21 ప్రభాతవార్త :** సికింద్రాబాద్ నియోజకవర్గంలోని పలు ప్రాంతాలలో జరిగిన బోనాల ఉత్సవాలలో సికింద్రాబాద్ కాంగ్రెస్ కంటెస్టెడ్ ఎమ్మెల్యే ఆదం సంతోష్‌కుమార్ పాల్గొని ప్రత్యేక పూజలు జరిపారు. ఆలయ నిర్వాహకులు శాలువాలు కప్పి సన్మానం జరిపారు. ఈ కార్యక్రమంలో సందీప్‌రాజ్, గంటరాజు సాగర్ తదితరులు పాల్గొన్నారు.

## 'సాహితికిరణం 17వ వార్షికోత్సవం వేడుకలు

**చిక్కడపల్లి, జూలై 21 ప్రభాతవార్త:** సాహితి కిరణం, శ్రీ త్యాగరాయ గానసభ సంయుక్త ఆధ్వర్యంలో 'సాహితికిరణం 17వ వార్షికోత్సవం వేడుకలను పురస్కరించుకుని వివిధ రంగాలకు చెందిన వారికి పలువురు ప్రముఖుల పేర్లపై ప్రదానం చేసే కార్యక్రమం నిర్వాహక సంస్థ గౌరవ సలహాదారు గుడిబండి వెంకటరెడ్డి అధ్యక్షతన జరిగింది. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన పూర్వ ఐఏఎస్ అధికారి కె.వి.రమణాచారి చేతులమీదుగా డాక్టర్ పింగళి జగన్నాథరావు స్మారక సాహిత్య పురస్కారాన్ని మరమాముల దత్తాత్రేయ శర్మకు, సిరిగాద నర్సయ్య స్మారకసాహిత్య పురస్కారాన్ని రమణ వెలమకన్నికి, సిరిగాద బాలమ్మ స్మారక సాహిత్య పురస్కారాన్ని శైలజామిత్రకు, గట్టుపల్లి చెంచురామారావు స్మారక ఆధ్యాత్మిక సాహిత్య పురస్కారాన్ని బండారుపల్లి రామచంద్రరావుకు అందించి గౌరవించారు. అనంతరం ఎం.బాలగంగాధరయ్య నిర్వహించిన బాలనాగయ్య స్మారక కవితాసంపుటాల పోటీల విజేతలు యాములపల్లి నరసిరెడ్డి(అనంతరపురం), లేదాళ్ళ రాజేశ్వరరావు(లక్సెటిపేట), డాక్టర్ ఉదారి నారాయణ(అదిలాబాద్)లకు అందించి గౌరవించారు. విశిష్టఅతిథులుగా త్యాగరాయ గానసభ అధ్యక్షుడు కళావిఎస్. జనార్దనమూర్తి, సాహితికిరణం సంపాదకులు పొత్తూరి సుబ్బారావు, నేటినిజం పత్రికఎడిటర్ బైసాదేవదాస్ సలహాదారు పెద్దూరి వెంకటదాసు, వి.వి.రాఘవ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. సాహితకిరణం ఆత్మీయ పురస్కారాలను డాక్టర్ ఎం.మధుసూదన్, ఎం.వి.కృష్ణారావు,రమణ బొమ్మకంటి, మల్లాది వెంకటరమణ, పి.రామోజు శ్రీనివాస్,పి.నరసింహారెడ్డి అందుకున్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా భాస్కరకళాసామ్రాజ్యం నిర్వహణలో పౌరాణిక పద్యనాటకమం 'పాండవోద్యోగము'నాటకంలోని 'శయనదృశ్యం' ప్రదర్శన అద్భుతంగా సాగింది.



పురస్కారాలను ప్రదానం చేస్తున్న ప్రభుత్వ పూర్వ సలహాదారు డాక్టర్ కె.వి. రమణాచారి

## శక్తిస్వరూపిణి మహంకాళి అమ్మవారు

**తెలంగాణ రాష్ట్ర బిసి కమిషన్ చైర్మన్ వకుళాభరణం కృష్ణమోహన్‌రావు**

**నాంపల్లి, జూలై 21 ప్రభాతవార్త :** ప్రతీ సంవత్సరం మొత్తం ఆషాడ మాసంలో హైదరాబాద్‌లో జరుపుకొనే బోనాల పండుగ ఎంతో ప్రత్యేకను సంతరించుకొందని, ఈ మాసంలో వచ్చే పర్వదినాల్లో గ్రామదేవతలకు నైవేద్యంను బోనాల రూపంలో అమ్మవార్లకు సమర్పించడం తెలంగాణ సంస్కృతిలో సంప్రదాయంగా వస్తుందని, ఇందులో భాగంగా 3వ ఆదివారం లష్కర్ బోనాలు జరుపుకొనే సికిందరాబాద్ ఉజ్జయిని మహంకాళి అమ్మవారు గొప్ప శక్తిస్వరూపిణి అని తెలంగాణ రాష్ట్ర బిసి కమిషన్ ఛైర్మన్ డా. వకుళాభరణం కృష్ణమోహన్‌రావు అన్నారు. అమ్మవారిని దర్శించుకొని అర్చకస్వాములచే గోత్రనామాలతో అర్చన కావించి, శేషవస్త్రం కప్పి, తీర్థప్రసాదాలు అందజేసిన అనంతరం కృష్ణమోహన్‌రావు మాట్లాడుతూ మహంకాళి అమ్మవారు సింహవాహిని, బంగారు మైసమ్మ, దర్బార్ మైసమ్మ, కనకాల కట్టమైసమ్మ, నల్లపోచమ్మ, ఊరపోచమ్మ మొదలైన అమ్మవార్లను వేడుకుంటూ ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా చూడాలని మనం సమర్పించే బోనం నైవేద్యం పరమ పవిత్రమైనదని తెలుపుతూ ప్రజలందరికీ బోనాల శుభాకాంక్షలు తెలిపారు.

### అమ్మవారి ఆశీస్సులతో ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలి

**డిప్యూటీ మేయర్ దంపతులు**

**తార్నాక, జూలై 21 ప్రభాతవార్త:** ఉజ్జయిని మహంకాళి అమ్మవారి బోనాల సందర్భంగా ఆదివారం నగర డిప్యూటీ మేయర్ మోతె శ్రీలత శోభన్‌రెడ్డి దంపతులు మహకాళి అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో వందల సంవత్సరాల బోనాల పండుగ సంప్రదాయం ఉందన్నారు.ఎంతో మహిమకల్గిన అమ్మవారిని నమ్ముకుంటె అన్ని శుభాలు జరుగుతాయన్నారు. రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని మమాంకాళి అమ్మవారిని కోరుకున్నామని వారు చెప్పారు.

### సనత్‌నగర్ నూతన ఇన్‌స్పెక్టర్‌గా శ్రీనివాసులు

సంజీవరెడ్డి నగర్, జూలై 21, ప్రభాతవార్త : సనత్‌నగర్ కొత్త ఇన్స్‌పెక్టర్‌గా 2004 బ్యాచ్‌కు చెందిన కె.శ్రీనివాసులు కూకట్‌పల్లి ట్రాఫిక్ ఇన్స్‌పెక్టర్‌గా చేస్తున్నశ్రీనివాసులను సనత్‌నగర్ ఎస్‌హెచ్‌ఓగా నియమిస్తూ సీపీ అవినాష్ మహంతి శనివారం సాయంత్రం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా ఆదివారం సనత్‌నగర్ ఇన్స్‌పెక్టర్‌గా కె.శ్రీనివాసులు బాధ్యతలు చేపట్టారు.

### బోనాల వేడుకల్లో పాల్గొన్న రామకృష్ణ

**కంటోన్మెంట్, జూలై 21 ప్రభాతవార్త:**
కంటోన్మెంట్ ఐదో వార్డులోగల మహాత్మాగాంధీనగర్‌లో ఆదివారం నిర్వహించిన బోనాల వేడుకల్లో కంటోన్మెంట్ బోర్డు నామినేటెడ్ మెంబర్ జె. రామకృష్ణ పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు అజయ్ యాదవ్ తధితరులు పాల్గొన్నారు.

## ఎర్రగడ్డలో కళ్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ

**యూసుఫ్‌గూడ, జూలై 21, ప్రభాతవార్త :** ప్రజా సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరూ పొందాలని బిఆర్ఎస్ హైదరాబాద్ జిల్లా అధ్యక్షులు జూబ్లిహిల్స్ శాసనసభ్యులు మాగంటిగోపినాథ్ అన్నారు. శనివారం ఎర్రగడ్డలో 35 మంది లబ్దిదారులకు కళ్యాణలక్ష్మీ, షాదీముబారక్ చెక్కులను అందజేశారు. ప్రజా సమస్యల పరిష్కారంలో తామెప్పుడు ముందుంటామని ప్రజలకు ఎలాంటి సమస్యలు ఉన్న తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. కార్యక్రమంలో బాల్‌నగర్ డిప్యూటి తహశీల్దార్ శ్రీనువాస్, జూనియర్ అసిస్టెంట్ కిరణ్‌కుమార్, కుమార్ స్వామి, డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షులు సంజీవ, ప్రధాన కార్యదర్శి సయ్యద్ షరీఫ్ ఖురేషి, షేక్ జావేద్, సయ్యద్ రసూల్, మహబూబ్ ఖాన్, శ్రీకాంత్, తరుణ్, బాలు, నరేష్, రాజు, తదితరులు పాల్గొన్నారు.

**రహదారి కబ్జాను కాపాడటంలో అధికారుల నిర్లక్ష్యంపై ఎమ్మెల్యే ఆగ్రహం**

ప్రభుత్వ స్థలాలను రహదారులను ఆక్రమించేందుకు ప్రయత్నిస్తే అటువంటివారిపై కఠినచర్యలు తీసుకోవడం జరుగుతుందని జూబ్లిహిల్స్ శాసన సభ్యులు మాగంటిగోపినాథ్ అన్నారు. నియోజకవర్గం పరిధిలోని ఎర్రగడ్డ డివిజన్ సారథి కోఆపరేటివ్ హౌసింగ్ సొసైటీలో ప్రభుత్వ రహదారిని ఆక్రమించుకుని ఓ కార్పొరేటర్ ప్రహరి గోడ నిర్మించారు. దాని విషయమై పలుమార్లు స్థానికులు ఎమ్మెల్యే సైతం అధికారులకు ఫిర్యాదు చేసిన వారు ఏమాత్రం పట్టించుకోలేదు. స్వయంగా ఎమ్మెల్యేమాగంటి గోపినాథ్ శనివారం సారథి సొసైటీలోని కబ్జాకు గురైన స్థలాన్ని పరిశీలించారు.రెవెన్యూ అధికారులు టౌన్‌ప్లానింగ్ అధికారులను పిలిపించి వివరాలు అడిగి తెలుసుకున్నారు.రహదారి దర్జాగా కబ్జాకు గురవుతుంటే మీరు ఏమి చేస్తున్నారని అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు.గతంలో కూడా ఈ ప్రాంతంలో ఓపెన్ ప్లాట్లు కబ్జాలకు గురవుతున్నట్లు తమ దృష్టికి రావడంతో స్వయంగా జిల్లా కలెక్టర్‌ను ఈ ప్రాంతంలో పర్యటించారు. అయిన కబ్జాలు ఆగడం లేదు. ప్రస్తుతం కబ్జాకు గురయిన రహదారి స్థలంలో గతంలో ప్రభుత్వ స్థలం అంటే బోర్డు ఉండేది అయితే బోర్డును తొలగించి ప్రహరి నిర్మించారు.ఈ విషయమై తొందరలోనే జిల్లా కలెక్టర్‌ను కలుస్తామని ఎమ్మెల్యే పేర్కొన్నారు.

### భవిష్యత్ సమాజం మార్పుకు సైకాలజిస్ట్‌ల సేవలు అవసరం

**సైఫాబాద్, జూలై 21 ప్రభాతవార్త:** అద్భుతమైన, ఆనందమైన జీవితానికి మానవ సంబంధాలు ఎంతో ముఖ్యమని, మసక బారుతున్న మానవ సంబంధాలు, మానవ విలువలను మెరుగుపర్చాల్సిన బాధ్యత సైకాలజిస్టులపై ఉందని తెలంగాణ సైకాలజిస్ట్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ మోతుకూరి రాంచందర్ చెప్పారు. నేటి ప్రపంచీకరణ, కంప్యూటర్ యుగంలో అడుగంటుతున్న కుటుంబ సంబంధాలు ప్రగతి నిరోధకంగా మారాయని, జీవితంలోని ప్రతి సన్నివేశంలోనూ సంబంధాలు ఒకరి నుంచి మరొకరికి ఉంటాయని వాటిని ఎంతో ప్రేమ, అప్యాయతలతో పెంపొందించుకోవాలని ఆయన సూచించారు. అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం సైఫాబాద్‌లో 'మానవ సంబంధాలు-వారి వ్యక్తిత్వ విశ్లేషణ' అనే అంశంపై జరిగిన శిక్షణ ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. అవి లేకపోతే భవిష్యత్తు సమాజం ప్రమాదంలో పడుతుందని, వ్యక్తిత్వాన్ని అంచనా వేయడానికి, వివిధ నైపుణ్యాలను అర్థం చేసుకోవడానికి వివిధ పద్దతులతో ఇతర వ్యక్తుల ప్రవర్తనలను మార్చడానికి ఈ శిక్షణ ఉపయోగపడుతుందన్నారు. సైకాలజీ రంగం మరింతగా అభివృద్ధి చెందాలంటే సైకాలజిస్టులు వారి నైపుణ్యాలను పెంపొందించుకోవాలని సూచించారు. భవిష్యత్తు తరం ఒక మంచి సమాజంగా రూపుదిదుకోవాలంటే సైకాలజిస్టుల సేవలు తప్పనిసరి అని రాంచందర్ తెలిపారు. కార్యక్రమంలో అసోసియేషన్ నాయకులు జగదీశ్వర్‌రావు, సుధాకర్, ఎ.వైదేహి, ముర్తుజా, నైనా మోహన్, గజ్జల సంధ్య, లక్ష్మి సౌజన్య, జెహ్రు ఫతిమ, అఫ్రిన్ పాల్గొన్నారు.

### అంబేద్కర్ నగర్ అధ్యక్షునిగా మాతంగి రమేష్ కుమార్

**మెహిదీపట్నం, జూలై 21, ప్రభాతవార్త :** లంగర్‌హౌస్ డివిజన్ అంబేద్కర్‌నగర్ నూతన కమిటిని ఆదివారం ఎన్నుకోవడం జరిగింది. కమిటీ అధ్యక్షునిగా మాతంగి రమేష్‌కుమార్, జనరల్ సెక్రటరీగా అల్వాల్ నరేందర్ రావు, ట్రెజరరీగా గద్దం దర్శన్‌లను కమిటీ సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా అధ్యక్షులు మాతంగి రమేష్ కుమార్ మాట్లాడుతూ..అంబేద్కర్ నగర్ అభివృద్ధికి తన శక్తివంచలేకుండా కృషిచేస్తానని తెలిపారు. ఎక్కడ ఎలాంటి సమస్యలున్నా వెంటనే స్పందించి వాటి పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. అనంతరం నూతన కమిటీ సభ్యులకు స్థానికులు పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో అంబేద్కర్‌నగర్ కమిటీ సభ్యులతో పాటు స్థానికులు పాల్గొన్నారు.

# వైద్య సేవలను విస్తృతపరచాలి : ఎంపి మల్లు రవి

**కెపిహెచ్‌బి కాలనీ, జూలై 21, ప్రభాతవార్త**

కార్పొరేట్ వైద్యసంస్థలు పేదలను దృష్టిలో పెట్టుకొని వైద్యసేవలను మరింత విస్తృతపరచాలని పార్లమెంట్ సభ్యులు డాక్టర్ మల్లు రవి సూచించారు. ఆదివారం కూకట్‌పల్లి హౌసింగ్ బోర్డు రోడ్ నెంబర్ 1లో నూతనంగా ఏర్పాటు చేసిన క్లేయో స్కిన్ హెయిర్ బాడి లెజర్ క్లీనిక్‌ను డాక్టర్ మల్లు రవి ముఖ్య అతిథిగా విచ్చేసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో విశిష్ట అతిథులుగా ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ, ఎమ్మెల్యే కేపీ వివేకానంద, సిద్దిపేట ఎమ్మెల్యే హరీష్‌రావు, తెలంగాణ ఫిల్మ్ డెవలప్‌మెంట్ కౌన్సిల్ అధ్యక్షులు గొట్టిముక్కల పాండురంగారావు, కార్పొరేటర్లు శిరీషబాబురావు, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మల్లు రవి మాట్లాడుతూ పేద ప్రజలను దృష్టిలోపెట్టుకొని వారికి రాయితీ కల్పిస్తూ వైద్య సేవలు అందించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. అనంతరం డాక్టర్ వాణి మాట్లాడుతూ అందరికి అందుబాటులో ఉండే ఫీజులతో చర్మ సౌందర్యాన్ని తమ క్లైంట్స్‌కి చికిత్సలు చేస్తామన్నారు. ఎలాంటి సైడ్‌ఎఫెక్ట్స్ లేకుండా నిబంధనలు, ప్రమాణాలు పాటించి వైద్యసేవలు అందించడమే లక్ష్యంగా ముందుకు పోతున్నామన్నారు. చికిత్స కోసం వచ్చిన తరువాత పూర్తిగా నయం అయ్యేవరకు తామే బాధ్యత తీసుకుంటామని అన్నారు.



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ఎంపి డాక్టర్ మల్లు రవి, ఎమ్మెల్యే హరీష్‌రావు తదితరులు

## అర్హులైన ప్రతి రైతు బీమా పథకానికి దరఖాస్తు చేసుకోవాలి
### మండల వ్యవసాయాధికారి వెంకటేశం

**షాబాద్, జూలై 21, ప్రభాతవార్త :** అర్హులైన ప్రతి రైతు బీమా పథకానికి దరఖాస్తు చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి వెంకటేశం ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. కొత్తగా పట్టాదారు పాస్‌పుస్తకం పొందిన వారు ధరణి పోర్టల్‌లో రిజిస్ట్రేషన్ 28/6/2024కి పూర్తి చేసుకున్న ఆర్ఓ ఎఫ్ఆర్ పట్టాలు/పొందిన రైతులు బీమా పథకానికి దరఖాస్తు చేసుకోవాలన్నారు. రైతు సమూహ జీవితం బీమా పథకం, ఏదైనా కారణాల వల్ల రైతు ప్రాణాలు కోల్పోతే కుటుంబ సభ్యులకు సామాజిక భద్రత కల్పించడం జరుగుతుందన్నారు. రైతు ప్రాణాలు పోతే వారి కుటుంబాలకు రోజువారి అవసరాలకు సైతం తీవ్ర ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని, అందువల్ల రైతుబీమా పథకం 18నుండి 59 ఏళ్ల వయసు ఉన్న రైతులు బీమా పథకానికి దరఖాస్తు చేసుకోవాలన్నారు. అందుకు ఆధార్‌కార్డులో వయస్సు 14/8/1965 నుండి 14/08/2006 మధ్య ఉన్న రైతులందరూ అర్హులని మండల వ్యవసాయాధికారి వెంకటేశం తెలిపారు.

## తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

**పూడూరు, జూలై 21, ప్రభాతవార్త :** గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైన సంఘటన వికారాబాద్ జిల్లా పూడూరు మండలంలో చోటు చేసుకుంది. చెన్‌గోముల్ ఎస్ఐ మధుసూధన్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం పూడూరు మండలం పరిధిలోని మీర్జాపూర్ గేట్ సమీపంలో హైద్రాబాద్..బీజాపూర్ రహదారి పక్కల ఆదివారం ఉదయం (20, 35) వయస్సుగల్ల వ్యక్తిశవం కనిపించినట్లు స్థానికులు ఇచ్చిన సమాచారం మేరకు చెన్‌గోముల్ పోలీసులు ఘటన స్థలానికి వెళ్లి పరిశీలించారు.అయితే మృతుడివద్ద ఎలాంటి గుర్తింపు ఆధారాలు లేకపోవడంతో ఈ విషయమై సామాజిక మధ్యమాల ద్వారా తెలుసుకు నేందుకు ప్రయత్నిఇస్తున్నట్లు,శవాన్ని వికారాబాద్ ప్రభుత్వాసుపత్రికి తరళించినట్లు ఎస్ఐ వివరించారు.మృతుడికి బ్లూప్యాంటు, గ్రీన్‌గీతలు గల శర్టు ఉన్నట్లు, సంబంధీకులెవరైనా ఉంటే చెన్‌గోముల్ పోలీస్‌స్టేషన్ 8712670024 నెంబరును సంప్రదివచాలని తెలిపారు.

**రైతులు రైతుభీమా కోసం దరఖాస్తు చేసుకోవాలి : ఏఓ**

**బొంరాస్‌పేట్, జులై21, ప్రభాతవార్త :** కొత్తగా పట్టాదారు పాసుపుస్తకాల పొందిన రైతులు రైతుభీమా కోసం దరఖాస్తు చేసుకోవాలి మండల వ్యవసాయ అధికారి అనురాధ తెలిపారు.జూన్ 28వ తేది వరకు కొత్తగా పట్టాదారు పాసుపుస్తకాలు పొందిన రైతులు,ఇంతకుముందు రైతుభీమా చేసుకోకపోయిన రైతులు మాత్రమే రైతుభీమా కోసం దరఖాస్తు చేసుకోవాలన్నారు.గతంలో భీమా చేసుకున్న రైతులు అందులో ఎవైన మార్పులు,చేర్పులు చేసుకోవాలంటే మార్పులు చేసుకోలన్నారు. ఆధార్,నామీని మృతిచెందితేమార్పులు చేసుకునేందుకు జులై 30వ తేది వరకు ఆవకాశం ఉందన్నారు.కొత్తగారైతుభీమా కోసం దరఖాస్తు చేసుకునే రైతులు దరఖాస్తు ఫారం,పట్టాదారు పాసుపుస్తకం, నామినీ ఆధార్‌కార్డులను జిరాక్స్‌లను ఏఈఓల సమక్షంలో సంతకం చేసి ఇవ్వలన్నారు.రైతుభీమా కోసం 14 ఆగస్టు 1965 నుండి 14 ఆగస్టు 2006 మధ్యలో జన్మించి 18 సంవత్సరాల నుండి 59 సంవత్సరాల వయస్సు ఉన్న రైతులు మాత్రమే అర్హులని ఆమే తెలిపారు.

## మున్సిపల్ అధికారులు అప్రమత్తంగా ఉండాలి
### శిథిలావస్థ ఇండ్లలో ఉన్నటువంటి ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలి

**సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి:** వర్షాల మూలంగా మున్సిపల్ అధికారులు అ ప్రమత్తం ఉండాలని.. శిథిలావస్థ ఇండ్లలో ఉన్నటువంటి ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలని మున్సిపల్ చైర్మన్ కడవెర్గు మంజు రాజనర్సు ఆదేశించారు. అదివారం చైర్మన్ మున్సిపల్, కమిషనర్ కె.ప్రస న్నరాణి, అధికారులు,కౌన్సిలర్లతో కలిసి పట్టణంలో పర్యటించారు.చెరువులు,కుంటల వద్దకు ఎవరూ వెళ్లొద్దన్నారు. వర్షాల దృష్ట్యా అధికారులు,కౌన్సిలర్లతో కలిసివార్డులో పర్యటించాలన్నారు. శిథిలావస్థలో నివాసముంటున్న వారిని గుర్తించి సురక్షిత ప్రాంతాలకు తరలించాలన్నారు. మున్సిపల్,పబ్లిక్ హెల్త్ అధికారులందరూ ఎప్పుడు అందుబాటులో ఉండాలన్నారు. మ్యాన్ హోల్‌పై కప్పులనుయూజీడీ అధికారులు సిబ్బంది పరిశీలించాలన్నారు. ఏదైనా సమస్య వస్తే వెంటనే మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటు చేసి హెల్ప్ డెస్క్‌కు ఫోన్ చేసి సద్వినియోగం చేసుకోవాలన్నారు. 9505507248కు ఫోన్ చేయాలన్నారు.

**జాతీయ రహదారిపై ఘోర రోడ్డు ప్రమాదం**

## కార్లు ధ్వంసం, గుర్రం మృతి పలువురికి తీవ్ర గాయాలు ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం

**కౌడిపల్లి, జూలై 21, ప్రభాతవార్త:** 765డి జాతీయ రహదారిపై మండల కేంద్రమైన కౌడిపల్లి గ్రామంలోని పెద్ద ఖానల (బ్రిడ్జ్) వద్ద ఆదివారం నాడు సాయంత్రం ఘోర రోడ్డు ప్రమాదం సంభవించించి. స్థానికుల కథనం ప్రకారం గొర్రల మేతకోసం వలస వచ్చే గొర్రెల కాపరీలు గొర్రలతోపాటు వారి సామాన్లను ఒక గుర్రం మీద తరలించుకుంటు మెదక్ నుండి నర్సాపూర్ వైపు వెళ్లుతున్న క్రమంలో నర్సాపూర్ నుండి మెదక్‌కు వచ్చే కారు అతివేగం వచ్చి పెద్ద ఖానలు (బ్రిడ్జ్) వద్ద గుర్రంను ఢీ కొంది. గుర్రంను ఢీ కొట్టిన కారు తిరిగి హైదరాబాద్ దికు తిరిగిపోగా, మెదక్ నుండి వెళ్లుతున్న మరో రెండు కార్లు ఒక్కదాని వెనుక ఒక్కటి బలంగా ఢీ కొన్నాయి. ఈ ఘోర రోడ్డు ప్రమాదంలో గుర్రం మృతి చెందగా, 7 మందికి తీవ్ర గాయాలైనట్లు స్థానికులు తెలిపారు. కాగా బ్రిడ్జ్ మధ్యలో ఈ రోడ్డు ప్రమాదం జరుగగా, మూడు కార్లు రోడ్డ మధ్యలో ధ్వంసమై జాతీయ రహదారిపై వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం కల్గింది. పోలీస్ స్టేషన్‌కు కిల్లో మీటర్ దూరంలో జరిగిన ప్రమాద ఘటన స్థలాన్నికి సకాలంలో పోలీస్‌లు స్పందించి రాక పోవడంతో వాహనాదార్లు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవడం జరిగిందని స్థానికులు వాపోయారు. అసలే ఆదివారం కాగా మెదక్ చర్చికి వెళ్లే భక్తులు, ఏడుపాయల వనదుర్గాదేవి ఆలయంకు వెళ్లే భక్తుల వాహనాల సంఖ్య అధికంగా ఉండి ట్రాఫిక్ అధికమైపోయిందని, చేసేది లేక స్థానికులే రోడ్డు ప్రమాదంలో ఇరుకుపోయిన క్షతగాత్రులను వెలికి తీసి, ట్రాఫిక్ క్లీయర్ చేసినట్లు తెలిపారు. సంఘటన జరిగిన 40 నిమిషాల తర్వాత పోలీసులు వచ్చి పంచనామా, రోడ్డుపై వాహనాలను తొలగించినట్లు వివరించారు. కాగా రోడ్డు ప్రమాదంలో తీవ్రగాయాలైన వారి వివరాలు ఇలా ఉన్నాయి. ఇండికా కారు టిఎస్12 ఇఆర్ 4651 నర్సాపూర్ నుండి మెదక్‌కు వెళ్లే వాహనం ముందుగా గుర్రంను ఢీ కొట్టింది. కాగా ఈ కార్లులో ప్రయాణించే వారిలో లక్ష్మి(50)ఛాతీ, మోకాళ్లకు గాయాలు, సంధ్య(27) మోకాళికి గాయాలు, పిల్లలు నిహారిక (5), తరుణ తేజ్ (2), సాయి తేజ 9 మాసాల బాబుకు ఏలాంటి గాయాలు కాకపోగా గుర్రం మృతి చెందగా, గుర్రం వెనుకాలో వస్తున్న సంగారెడ్డి జిల్లా కొండపూర్ మండలం మల్లేపల్లి గ్రామానికి చెందిన మన్నె మల్లేశం కాళ్లు విరిగినాయి. ఇండికాను ఢీ కొట్టిన ఎపి09 బిపి8792 అల్టో కారులో ఉన్న ఆరు మందికి తీవ్రగాయాలైనాయి. వారిలో అబ్దుల్ రహీం (50) ఛాతీకి గాయాలు, కాళు విరిగింది, హసిన బేగం (60) కాళు విరిగింది, ఆఫీసా బేగం(50)కాళుకు తీవ్ర గాయాలు, ఫరానా, ఆసీఫాహుస్సేన్, సోహబ్ హుస్సేన్‌లు ముగ్గరికి ఏలాంటి గాయాలు కాలేదు. అల్టోకారును ఢీ కొట్టిన టిఎస్ 15 ఎఫ్‌క్యూ2444నంబరు గల షిఫ్టు కారు ధ్వంసం కాగా ఏవరికి ఏలాంటి గాయాలు కాలేవని తెలిసింది. క్షతగాత్రులందరిని 108 అంబులెన్స్ సహాయంతో నర్సాపూర్ ఏరియా ఆసుపత్రికి చికిత్స నిమిత్తం తరలించి, ప్రమాదంలో పూర్తిగా ధ్వంసమైన కార్లను స్టేషన్‌కు తరలించి, ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిసింది.

### నిత్యావసర సరుకుల పంపిణీ

**చిన్నశంకరంపేట, జూలై 21, ప్రభాతవార్త:** చిన్నశంకరంపేట పట్టణానికి చెందిన రైతు పరమేశ్వర్ గత కొన్ని రోజుల క్రితం అప్పుల బాధతో ఆత్మహత్యకు పాల్పడ్డాడు. అతని భార్య శంకరమ్మ ముగ్గురు పిల్లలను చదివించుకుంటూ నిత్యావసర సరుకులు లేక ఇబ్బంది పడుతున్నారు. ఈ విషయం తెలుసుకున్న లిటిల్ సోల్జర్ ఫౌండేషన్ నల్గొండ వారు నాలుగు నెలలకు సరిపడా నిత్యావసర సరుకులను ఆదివారం వారికి అందించారు.



నందిగామ సాయిబాబా దేవాలయంలో పూజలు నిర్వహించిన ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డి



ఆమనగల్లులో షిర్డిసాయినాథున్ని దర్శించుకుంటున్న భక్తులు



శంషాబాద్‌లో సతీష్ నాయర్ గురుస్వామికి ఘన నివాళులు అర్పిస్తున్న దృశ్యం



సాయిబాబా ఆలయంలో బాబాను దర్శించుకున్న భక్తులు

# ఘనంగా గురుపౌర్ణమి వేడుకలు

**నందిగామ, జులై 21, ప్రభాతవార్త:** గురుపౌర్ణమి పర్వదినాన్ని పురస్కరించుకుని ఆదివారం నందిగామ మండల కేంద్రంలో ఉన్న సాయి బాబా దేవాలయంలో మహబూబ్‌నగర్ ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం తాండ్ర బ్రదర్స్ ఎమ్మెల్సీని శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ ప్రజలందరికీ శాంతి సౌభాగ్యం మంచి జరగాలని కోరుకుంటున్నట్లు తెలిపారు. ఈ వేడుకల్లో దేవాలయ నిర్మాణ దాతలు తాండ్ర రామకృష్ణారెడ్డి తాండ్ర గోపాల్‌రెడ్డి మాజీ ఎంపిటిసిలు కొమ్ము కృష్ణ మాజీ ఉప సర్పంచ్ జిల్లెల్ల జనార్దన్‌రెడ్డి అడ్వకేట్ విక్రమ్‌శర్మ కొమ్ము వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

**ఆమనగల్లులో..**

**ఆమనగల్లు, జులై21, ప్రభాతవార్త:** ఆమనగల్లు పట్టణంలోని షిర్డిసా యి ఆలయంలో ఆదివారం గురుపౌర్ణమి వేడుకలను భక్తులు అత్యంత భక్తిశ్రద్దల మధ్య కన్నుల పండువగా జరుపుకున్నారు. గురపౌర్ణమి పుర స్కరించుకుని ఆలయంలో పలు ప్రత్యేక పూజలు, కార్యక్ర మాలు నిర్వ హించారు. వేలాదిమంది భక్తులు తరలివచ్చి సాయినాథుని దర్శించుకున్నారు. దీంతో ఆలయంలో భక్తుల తాకిడి మొదలు కాగా, ఆలయా నికి విచ్చేసిన భక్తులతో కిటకిటలాడిపోయింది. గురుపౌర్ణమి సంధ ర్భంగా నిర్వహకులు అభిషేకాలు, సత్యనారాయణస్వామి వ్రతాలు, పూజలు చేపట్టారు. ఆలయాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. ఆర్కెస్ట్రాతో భక్తి గీతాలపన అందరిని ఆకట్టుకుంది. దీంతో సాయినా థుని నామ స్మరణతో ఆప్రాంతం మారుమ్రోగిపోయింది. ఆలయానికి విచ్చేసిన మహిళా భక్తులు కోలాటాలు, బతుకమ్మ ఆట పాటలతో అల రించారు. కాగా శ్రీరామ అండ్ కం బజాజ్‌షోరూం వారు అన్నదానం కార్యక్రమం నిర్వహించారు. ఆలయ పూజారుల బృందం భరతుల మధుసూధన్‌శర్మ, రవికిరణ్, కార్తిక, మోహిత్‌కుమార్, కౌశిక్‌లు ఆధ్యా త్మిక కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ అభివృద్ధి కమిటీ మెంబర్స్ పాపిశెట్టి రాము, స్థానిక కౌన్సి లర్ చెక్కాల లక్ష్మణ్, పాలాది ఆంజనేయులు, నయనాచారి, రామకృష్ణంరాజు, బికుమాండ్ల శ్యాంసుం దర్, దార్ల చిత్తరంజన్‌దాస్, శ్రీనునాయక్, మూర్తి, గాజుల సురేష్, బావండ్ల సునీత తదితరులు ఉన్నారు.

**సతీష్ నాయర్ గురుస్వామికి ఘన నివాళులు**

**శంషాబాద్, జులై21, ప్రభాతవార్త :** గురుపౌర్ణమి పురస్కరించుకుని పాల మాకుల గ్రామంలో ప్రముఖ అయ్యప్ప భక్తులు తమ గురువుకు నివా ళులు అర్పించారు. తెలంగాణ ప్రాంతాల్లో అనేకమంది ఆధ్యాత్మికం వైపు నడిపిస్తూ అయ్యప్ప పూజలను చేస్తూ గురుబ్రహ్మగా ప్రసిద్ధి గాంచిన సతీష్‌నాయర్ శిష్యులు ప్రత్యేక పూజలు నిర్వహించి గురుపూజా కార్యక్రమాన్ని నిర్వహించారు. తదనంతరం అన్నదాత కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. మాజీ ఎంపిపి చెక్కల ఎల్లయ్య ముదిరాజ్ రంగారెడ్డి జిల్లా లంబాడ హక్కుల పోరాట సమితి అధ్యక్షుడు మాజీ ఎంపిటిసి ఉమ్లు నాయక్ గుడాల కృష్ణగౌడ్ వీరమల్లేష్ నిరంజన్ తదితరులు పాల్గొన్నారు.

**మేడ్చల్‌లో..**

**మేడ్చల్, జూలై 21. ప్రభాతవార్త :** గురు పూర్ణిమి దినోత్సవాన్ని మేడ్చల్‌లో ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని సాయిబాబా ఆలయంలో ఈ సందర్భంగా ఉదయం నుంచి ప్రత్యేక పూజలు, సత్యనారాయణ స్వామి వ్రతాలు జరిపి మధ్యాహ్నం బాబాకు ఆరతి నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేపట్టారు. సాయంత్రం మేడ్చల్‌లోని పురవీదుల్లో భాజా భజంత్రీలతో శోభయాత్ర జరిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ దాత్రిక సింహం, కమిటి సభ్యులు రమే ష్, బాలు యాదవ్, పూల నారాయణ, విష్ణు చారీ, చంద్రశేఖర్‌రెడ్డి, రమేష్, గిరిధర్, అశోక్, భక్తులు పాల్గొన్నారు.

## ప్రతి రోజు యోగాను అలవాటు చేసుకుంటే వ్యాధులు దరిచేరవు

**నర్సాపూర్ జులై 21. ప్రభాతవార్త :** ప్రతి రోజు యోగాను అలవాటు చేసుకుంటే వ్యాధులు దరిచేరవని హైద్రాబాద్ కు చెందిన యోగా గురూజీలు కిష్టంగారి భైరయ్య సూర్యకళ దంపతులు పేర్కొన్నారు. ఆదివారం గురుపూర్ణిమ సందర్బంగా లైన్స్‌క్లబ్ నర్సాపూర్ నిత్య జీవన యోగా సాధన సమితీ అధ్వర్యంలో గురు పూర్ణిమ వేడుకలను సాయికృష్ణా గార్డెన్ లో నిర్వహించారు.ఈ సందర్బంగా ఈకార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన యోగా గురూజీలు కిష్టంగారి భైరయ్య సూర్యకళ దంపతులు మాట్లాడుతూ యోగాతో మానసిక ప్రశాంతత లబిస్తుందన్నారు. రోజులో కొంత సమయాన్ని యోగా కు కేటాయించడంతో రోజంతా ఆనందంగా గడప వచ్చని అన్నారు.ఈ మేరకు ప్రతి ఒక్కరు యోగానుఅభ్యసించి ప్రతి రోజు యోగానుచేయాలని వారు సూచించారు. అయితే ముందుగా అష్టదశ పురాణాలను రాసిన వేద వ్యాసుని చిత్రపటానికి పూలమాలలు వేసి జ్యోతి ప్రజ్వళన చేశారు.అనంతరం యోగా గురుజీలు లైన్స్‌క్లబ్ వారిని నిత్య జీవన యోగా సమితీ అధ్వర్యంలోగురూజీలను శాలువాలతో, పూల మాలలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో బుస్స చంద్రశేఖర్, సురేందర్‌గౌడ్, లైనన్స్‌క్లబ్ అధ్యక్షులు మంద జైపాల్, ఫాస్ట్ డిస్ట్రిక్ ట్రెజరరీ నర్సింహ్మారెడ్డి, సెక్రటరీ కొండ శ్రీకాంత్, ట్రెజరరీ మాణిక్యంగౌడ్, పిఏసిఎస్ చైర్మన్ రాజుయాదవ్, బుచ్చేష్‌యాదవ్, రాములు యాదవ్, కుమ్మరి సంజీవ్, హన్మంతుసేట్, కుమ్మరి అశోక్, భాస్కర్, బ్రహ్మం తదితరులు పాల్గొన్నారు.

## 10 వ రోజులుగా వర్షంలో రైతుల రిలే నిరహార దీక్ష

**నర్సాపూర్ జులై 21. ప్రభాతవార్త :** కొండ పోచమ్మ సాగర్ నుండి సంగారెడ్డి కెనాల్ లో భూముల కోల్పొతున్న భూనిర్వాసిత రైతులకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తు నర్సాపూర్ అంబెడ్కర్ చౌరస్తాలో చేపట్టిన భూనిర్వాసిత రైతులు చేపట్టిన రిలే నిరహార దీక్ష ఆదివారం కు 10 వ రోజుకు చేరుకుంది. నిలకడ లేకుండా కురుస్తున్న వర్షాన్ని సైతం లెక్క చేయకుండా రైతుల నిరహార దీక్ష 10 రోజులుగా చేస్తున్న ప్రభుత్వ అధికారులుగాని, ప్రజా ప్రతినిధులు గాని పట్టించుకున్న పాపానా పోవడం లేదని రైతులు వాపోయారు.ఎండనక, వాననక రైతులు చేస్తున్న దీక్షను పట్టించుకునేనాదుడే వరువయ్యారు. రైతే రాజు అని రైతు ప్రభుత్వ మని చెప్పుకుంటున్న ప్రభుత్వం రైతులంటే ఇంత చిన్న చూపాఅని బావురుమంటున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి భూనిర్వాసిత రైతులు న్యాయం చేయాలని కోరారు. అప్పటి వరకు ఈ నిరహార దీక్ష కార్యక్రమం కొనసాగుతుందని వారు తెలిపారు.ఈ మేరకు ఈ దీక్షలో పాల్గొన్న లోక్‌సత్తా నర్సాపూర్ నియోజకవర్గ ఇంచార్జీ మిర్యాల చంద్రశేఖర్ ఈ దీక్షకు సంఘీ బావం తెలిపి మాట్లాడుతూ ప్రభుత్వం వెంటనే స్పందించి రైతుల బాధలను పట్టించుకోవాలన్నారు లేని పక్షంలో ఈఉద్యమాన్ని మరింత ఉదృతం చేస్తామని ఆయన హెచ్చరించారు. ఈ దీక్షలో పెద్దచింతకుంట, బ్రాహ్మణపల్లి,, చిన్నచింతకుంట గ్రామాలకు చెందిన రైతులు దీక్షలో కూర్చున్నారు. ఈకార్యక్రమంలో రైతులు నర్సింహ్మారెడ్డి, మహేశ్‌గౌడ్,స్వామి, శ్రీకాంత్‌రెడ్డి , రాజమౌళి, పోచయ్య, ప్రేమ్‌చరణ్,అంజయ్య, తుక్కయ్య లతో పాటు వివిద గ్రామాల రైతుల పాల్గొన్నారు.

## బాధితుడికి 2 లక్షల 50 వేల ఎల్‌వోసి అందజేసిన ఆవుల రాజిరెడ్డి

నర్సాపూర్ జులై 21. ప్రభాతవార్త : నర్సాపూర్‌పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ క్యాంపుకార్యాలయంలో బాదితుడికి 2 లక్షల 50 వేల ఎల్‌వోసి ని టిపిసిసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నర్సాపూర్‌నియోజ.కవర్గ ఇంచార్జీ ఆవుల రాజిరెడ్డి అధ్వర్యంలో అందజేయడం జరిగింది. మాసాయిపేట మండల కేంద్రానికి చెందిన రాజుల విజయ అనారోగ్యంతో బాధపడుతూ హైద్రాబాద్‌లోని నీమ్స్ ఆసుపత్రిలో చికత్స పోందుతున్నారు.వారి చికిత్స కోసం డబ్బులు అవసరమున్నందున 2 లక్షల 50 వేల ఎల్‌వోసి ని ముఖ్యమంత్రి సమాయనిధి నుండి నర్సాపూర్ లో టిపిసిసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నర్సాపూర్‌నియోజ.కవర్గ ఇంచార్జీ ఆవుల రాజిరెడ్డి చేతుల మీదుగా అందజేశారు. ఈకార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు కరుణాకర్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకుల కార్యకర్తలు తదితరులుపాల్గొన్నారు.

## ఘనంగా గురుపూర్ణిమ వేడుకలు

**నర్సాపూర్ జులై 21. ప్రభాతవార్త :** గురుపూర్ణిమ పర్వదినాన్ని పురస్కరించుకొని నర్సాపూర్‌పట్టణంలోని ఎన్జీవోస్ కాలనీ గల సాయిబాబ ఆలయంలో ఆదివారం గురుపూర్ణిమ వేడుకలను ఘనంగా నిర్వహించారు.ఈ సందర్బంగా సాయిబాబా ఆలయంలోఉదయం శ్రీ సాయిబాబాకు ప్రత్యేక అభిషేకం, అలంకరణ,సాయిసత్య వ్రతములు, హారతీ వంటి ప్రత్యేక పూజా కార్యక్రమాలను భక్తి శ్రద్దలతో,నియమ నిష్టలతో ఆలయ పూజారి ప్రకాష్ పంతులు వేద మంత్రాల మధ్యన ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్బంగా ఈ ఆలయానికి భక్తులుపెద్ద సంఖ్యలో హాజరై సాయిబాబను దర్శించుకున్నారు.. అనంతరం అన్నదాత దుర్గప్పగారి వరలక్ష్మిఅంజగౌడ్ అధ్వర్యంలో మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం నిర్వహించగా హాజరైన భక్తులందరుఈ అన్నదాన కార్యక్రమంలో పాల్గొని అన్న ప్రసాదాన్ని స్వీకరించారు.అంతేగాక సాయంత్రం సాయిబాబ పల్లకి సేవా కార్యక్రమం, రాత్రి భజన వంటి కార్యక్రమాలను ఎంతొ ఘనంగా నిర్వహించారు. ఈ మేరకు నర్సాపూర్ సాయిబాబ ఆలయంలో గురుపూర్ణిమ వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. ఈకార్యక్రమంలో సాయిబాబ ఆలయ కమిటీ సభ్యులు,శ్రీనివాస్, చందన్‌రెడ్డి పట్టణ ప్రజలు, భక్తులు తదితరులుపాల్గొన్నారు.

**రైతులు రైతుబీమా పాలసీకి దరఖాస్తులు చేసుకోవాలి : ఏడిఎ**

**నర్సాపూర్ జులై 21. ప్రభాతవార్త :** కొత్తగా పట్టా పాస్ బుక్ లు వచ్చిన రైతులు గతసంవత్సరం రైతు బీమాకు దరఖాస్తులు చేసుకోలేని రైతులు 2024 సంవత్సరానిగాను రైతు భీమాకు పాలసీకి దరకాస్తులు చేసుకోవాలని నర్సాపూర్ వ్యవసాయ శాఖ ఏడిఎ సంధ్యరాణి తెలిపారు.ఈ సందర్బంగా ఆమె మాట్లాడుతూఈ రైతు బీమాకు దరఖాస్తులు చేసుకనే వారు 18 సంవత్సరాలు నిండి 59 సంవత్సరాల వయసుగల వారు అర్హులని తెలిపారు. ఈమేరకు ఈదరఖాస్తులు అగస్టు 4 వ తేదీ వరకు మీ క్లస్టర్ వ్యవసాయ విస్తీరణ అధికారికి దరకాస్తులు ఇవ్వాలని తెలిపారు.ఈ దరఖాస్తులో రైతుభీమా దరకాస్తు ఫారమ్, పట్టా పాస్ బుక్ జిరాక్స్ ఆధార్‌కార్డు, నామినీ ఆధార్ కార్డులు జత చేసి మీ దగ్గరలో ఉన్న ఏఈవోలకు గాని స్వయంగా ఇవ్వవచ్చని ఆమె తెలిపారు. కాగా రైతు బీమాలో తప్పులసవరణ చేయుటకుగాను ఈ నెల 29 వరకు అవకాశముందని , ఇదివరకు దరఖాస్తు చేసుకున్న రైతుల మరల దరఖాస్తు చేసుకోవల్సిన అవసరం లేదని తెలిపారు. ఈమేరకు అర్హత గల రైతులందరు రైతు భీమా పాలసీకి దరకాస్తులు చేసుకోవాలన్నారు.

## భూ వివాదంలో ఘర్షణ
### హెడ్ కానిస్టేబుల్‌పై గొడ్డలితో దాడి

**హుస్నాబాద్‌రూరల్, జూలై21, ప్రభాతవార్త** భూ వివాదంలో ఘర్షణ జరిగి కానిస్టేబుల్‌పై గొడ్డలి దాడి జరిగిన సంఘటన హుస్నాబాద్ మండలంలోని రాములపల్లి గ్రామంలో జరిగింది. వివరాల్లోకి వెళ్తే రాములపల్లి గ్రామానికి చెందిన నియిని రవిందర్ కరీంనగర్‌లో ఏఆర్ హెడ్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తాడని అయితే వారి వ్యవసాయ పొలంలోకి వెళ్లేందుకు దారి విషయంలో గత మూడేళ్లుగా పంచా యతీలు జరుగుతున్నాయని ఈ విషయంపై హుస్నాబాద్ పోలీస్ స్టేషన్‌లో వారం రోజుల క్రితం రవిందర్ ఫిర్యాదు చేయగా ఇరువురు పెద్ద మనుషుల సమక్ష్యంలో సమస్య పరిష్కరించుకుంటామని వెళ్లినట్లు అందిన సమాచారం మేరకు తెలుస్తోంది.ఇదిలా ఉండగానే ఆదివారం వర్షం పడిన నేపధ్యంలో రవిందర్ తన పొలం దున్నుకునేందుకు ట్రాక్టర్ పొలంలోకి తీసుకెళ్లే సందర్బంలో పుల్ల మల్లయ్యల ఇద్దరు కుమా రులు నాగయ్య, ఐలయ్యలు రవిందర్‌పై గొడ్డలితో దాడి చేసినట్లు గ్రామస్థు లు చెబుతున్నారు.దాడికి గురైన హెడ్ కానిస్టేబుల్ రవిందర్ హు స్నాబాద్ ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నట్లు తెలుస్తోంది.

## పంటలకు మద్దతు ధర చట్టంపై పార్లమెంటులో చర్చించాలి

**మిరుదొడ్డి, జులై 21, ప్రభాతవార్త :** పంటలకు కనీస మద్దతు ధర(ఎంఎస్‌పి) సి2 ప్లస్ 50 శాతం ప్రాతిపదికన ఇచ్చేందుకు చట్టబద్దత కల్పించాలని,పంటలను గ్యారెంటీగా సేకరించాలని కేంద్ర ప్రభుత్వం రాతపూర్వకంగా ఇచ్చిన హామీని అమలు చేయాలని నాగర్‌కర్నూల్ ఎంపి డాక్టర్ మల్లు రవిని స ంయుక్త కిసాన్ మోర్చా(ఎస్‌కెఎం) రాష్ట్ర కన్వీనర్ పశ్యపద్మ,దళిత బహుజన ఫ్రంట్ జాతీయ కార్యదర్శి పి. శంకర్, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు బి.ప్రసాద్, తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి మూడ్ శోభన్‌ఇఅలు అయన స్వగృహంలో కలిసి అదివారం వినతి పత్రాన్ని అందజేసినట్లు తెలిపారు. ఈ సందర్బంగా మల్లు రవి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలపై పార్లమెంటులో నిలదీస్తామని తెలిపినట్లు డిబిఎఫ్ జాతీయ కార్యదర్శి శంకర్ తెలిపారు. ఈ సందర్బంగా అయన మాట్లాడుతూ రైతాంగ సమస్యలపై పార్లమెంటులో మాట్లాడాలని శంకర్ కోరారు. రైతులు,వ్యవసాయ కార్మికులకు రుణభారం నుంచి విముక్తి కల్పించి రైతు ఆత్మహత్యలకు ముగింపు పలకడానికి సమగ్ర రుణమాఫీ చేయాలన్నారు. రైతులు, వ్యవసాయ కార్మికులకు నెలకు రూ.10 వేల పెన్షన్ ఇవ్వాలన్నారు. భూసేకరణ,పునరావాస చట్టం-2013 అమలు చేసి దేశ ం అంతటా ప్రతి యేడాది భూమి మార్కెట్‌ను సవరించాలన్నారు. ప్రాజెక్టులలో భూములు కోల్పోయిన వారికి తగిన నష్టపరిహారం అందించాలన్నారు. ఎరువులు,విత్తనాలు,పురుగు మందులు, విద్యుత్, నీటిపారుదల, పెట్రోలియం ఉత్పత్తులు,యంత్రాలు,ట్రాక్టర్లు వంటి వ్యవసాయ ఇన్‌పు ట్‌లపై జిఎస్‌టి అపాలన్నారు. రైతుల పోరాటాలకు సంబంధించిన అన్ని కేసులను ఎత్తివేయాలన్నారు.

## నాగల్‌గిద్దను అభివృద్ధిలో ముందుంచుతా
### ఎమ్మెల్యే డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి

**నాగల్‌గిద్ద, జులై 21, ప్రభాతవార్త:** నాగల్‌గిద్ద మండలాన్ని అభివృద్దిలో ముందుంచుతానని ఎమ్మెల్యే డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి అన్నారు. ఆదివారం మండల పరిధిలోని మోర్గి చౌరస్తాలో పోలీస్ అవుట్ పోస్ట్ నిర్మాణానికి ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మండల కేంద్రమైన నాగల్‌గిద్దలో అన్ని ప్రభుత్వ కార్యాలయాలు ఒకే చోట ఉండేట్లు భవన సముదాయాన్ని నిర్మిస్తామన్నారు. ఈ సందర్బంగా ఎఐసిసి అధ్యక్షులు మల్లికార్జున్ ఖర్గే జన్మదినాన్ని పురష్కరించుకుని పార్టీ కార్యకర్తలతో కలిసి బర్త్‌డే కేక్‌ను కట్ చేసి నోటిని తీపి చేసుకున్నారు. కార్యక్రమంలో ఇఎస్‌పి వెంకట్‌రెడ్డి, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మాణిక్‌రావు పాటిల్, సొసైటీ చైర్మన్ శ్రీకాంత్, నాయకులు గుండే రావు పాటిల్, వినోద్ పాటిల్, అంబాజీ, సంతోష్, మనోహర్ పాటిల్, బసవరాజ్, ఎస్ఐ సాయిలు, రాజశేఖర్, ఏఎస్ఐ అంజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఘనపురం ఆనకట్టను పరిశీలించిన జిల్లా ఎస్పి

**పాపన్నపేట, జులై 21, ప్రభాతవార్త:** గత రెండు రోజులుగా ఎడతెరపి లేకుండా వర్షం కురుస్తుండటంతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా ఎస్పి ఉదయ్‌కుమార్‌రెడ్డి సూచించారు. ఆదివారం మండలంలోని ఘనపురం ఆనకట్టను పోలీసు అధికారులతో కలిసి పరిశీలించారు. ఆనకట్ట వద్ద అవసరమైన బందోబస్తును నిర్వహించాలని, ప్రజలు కట్ట చెంతకు రాకుండా చర్యలు తీసుకోవాలని, బారికేడ్లు ఏర్పాటు చేయాలని బాధిత అధికారులకు సూచించారు. ఎస్పి వెంట మెదక్ రూరల్ సిఐ రాజశేఖర్‌రెడ్డి, ఎస్ఐ నరేష్, ఏఎస్ఐ సంగన్న కానిస్టేబుల్ ప్రవీణ్ తదితరులు ఉన్నారు.

## సిద్దిపేట వైశ్య భవనం నూతన కార్యవర్గం ఎన్నిక
### అధ్యక్షులుగా బాల్‌రాజేశం, ప్రధాన కార్యదర్శిగా శ్రీకాంత్

**సిద్దిపేట అర్బన్, జులై 21, ప్రభాతవార్త** సిద్దిపేట అర్యవైశ్య భవన నూతన కార్యవర్గ ఎన్నికలు అదివారం ఓటింగ్ ద్వారా నిర్వహించారు. అర్యవైశ్య భవనం ప్రతినిధులు ఓటింగ్‌లో పాల్గొని నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా అయిత బాల్‌రాజేశం, ప్రధాన కార్యదర్శిగా పోశెట్టి శ్రీకాంత్, కోశాధికారిగా గంప కృష్ణమూర్తి, ఉపాధ్యక్షులుగా చింత ప్రసాద్, కొత్తూరు అశోక్‌లు ఎన్నుకున్నారు. సహాయ కార్యదర్శులుగా జూలూరి శ్రీనివాస్, చకిలం రవిలను ఎన్నుకున్నారు.

## ఘనంగా ఉరడమ్మ బోనాల పండుగ

**జహీరాబాద్, జులూ 21, ప్రభాతవార్త:** పట్టణం లోని గడి వీధిలో ఆదివారం నిర్వహించిన ఉరడ మ్మ తల్లికి బోనాల పండగ ఉత్సాహ భరితంగా జరుపుకున్నారు. బోనాల ఉత్సవాల్లో ఎమ్మెల్సీ డాక్టర్ వెంకట్ బల్మూరి, కార్పోరేషన్ చైర్మన్ యన్ గిరిధర్‌రెడ్డిలు పాల్గొని ఉరడమ్మకు ప్రత్యే క పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ కమిటి బాధ్యులు ఎమ్మెల్సీ, చైర్మన్‌లను శాలువా తో ఘనంగా సత్కరించి తీర్థ ప్రసాదాలు అందచేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటి సభ్యులు శ్రీకాం త్‌రెడ్డి, మాజీ జడ్పీటిసి సభ్యులు, మాజీ ఎంపిపి అధ్యక్షులు, మాజీ ఎంపిటిసి, సర్పంచ్‌లు, మాఈజ కౌన్సిలర్లు, ఎన్ఎస్‌యుఐ నాయకులు,కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు

## మత్స్య కార్మికుల అభ్యున్నతికి కృషి చేస్తా

**చిన్నకోడూరు, జూలై 21, ప్రభాతవార్త :** చిన్నకోడూరు మండల కేంద్రానికి చెంది గుండు వెంకటేశం ఫిషరిస్ కార్పోరేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా నియామకం కావడంతో గ్రామ గంగపుత్ర సంఘం అధ్యక్షులు గుడిసె లక్ష్మయ్య, ఉపాధ్యక్షులు కనుగుల రమేష్, ప్రధాన కార్యదర్శి గుడిసే భిక్షపతి,కోశాధికారి గుండు భాస్కర్, డైరెక్టర్లు గౌటి లక్ష్మణ్,కనుగుల నర్సింలు,కనుగుల నాగరాజు, గుడిసె కనకయ్య, గుడిసె దానయ్య,పల్లె శ్రీనివాస్, లక్ష్మయ్య, పంపరి నరేష్,కనుగుల సత్తయ్య, లక్ష్మయ్య, మాజీ అధ్యక్షులు పంపరి కనకయ్య, గంగమ్మ గుడి చైర్మన్ మల్యాల ఉప్పు లపల్లె నర్సింహులు, మల్యాల శ్రీనివాస్, గంగపుత్ర సంఘం సభ్యులు శాలువాలతో ఘనంగా సత్కరించారు.ఈ సందర్భంగా గుండు వెంకటేశం మాట్లాడుతూ మత్స్యకార్మికుల సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని తెలిపారు.

## మల్లన్న స్వామిని దర్శించుకున్న ఎమ్మెల్సీతీన్మార్ మల్లన్న

**కొమురవెల్లి, జులై 21, ప్రభాతవార :** మండల కేం ద్రంలోని శ్రీ కొమురవెల్లి మల్లికార్జున స్వామిని ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న, జనగామ జిల్లా డీసీసీ అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి అదివారం దర్శించుకున్నారు. అలయ స ంప్రదాయం ప్రకారం అలయ అర్చకులు అధికారులు పూర్ణ కుంభంతో స్వాగతం పలికారు. ముఖ మండపంలో పట్నం వేసి అలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. తీన్మార్ మల్లన్నకు అధికారులు,అర్చకులు మల్లికా ర్జునస్వామి ఫోటోతో సత్కరించారు. రానున్న రోజుల్లో ఉపాధ్యాయుల, విద్యార్థుల, పట్టభద్రుల పక్షాన మండలిలో ప్రశ్నిస్తానని తీన్మార్ మల్లన్న తెలిపారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మహాదేవుని శ్రీనివాస్,గ్రామ శాఖ అధ్యక్షులు లింగపల్లి కనకరాజు,నాయకులు మేడికుంట శీను, రమణారెడ్డి, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఉరడమ్మను దర్శించుకున్న నరోత్తం

**జహీరాబాద్, జులై 21, ప్రభాతవార్త:** పట్టణంలోని గడి మహేలా వీధిలో ఆదివారం నిర్వహించిన ఉరడమ్మ తల్లి బోనాల వేడుకల్లో ఎస్సీ కార్పోరేషన్ మాజీ చైర్మన్ వై నరోత్తం హాజరై అమ్మవారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్ర మంలో ఆలయ కమిటి అధ్యక్షులు శ్రీకాంత్‌రెడ్డి, సభ్యులు, నాయకులు ఎన్‌జి నర్సింలు, చంద్రశేఖర్‌రెడ్డి, షాహీద్ పటేల్, చెంగల్ జైపాల్ తదితరులు పాల్గొన్నారు.

## మాజీ సిఎం కెసిఆర్‌తోనే గజ్వేల్ అభివృద్ధి
### -మాజీ ఎఫ్‌డిసి చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి

**గజ్వేల్, జులై 21 (ప్రభాతవార్త):** మాజీ ముఖ్యమంత్రి చంద్రశేఖర్‌రావు సారధ్యంలోనే గజ్వేల్ నియోజకవర్గం అభివృద్ధి చెందిందని మాజీ ఎఫ్‌డిసి చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం గజ్వేల్ పట్టణంలోని గణేష్ జ్యూవెల్లరీ షాపు ప్రారంభం సందర్బంగా ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వంలోనే గజ్వేల్ పట్టణ రూపురేఖలు మారాయని, దేశంలోనే గజ్వేల్‌కు పేరుప్రఖ్యాతలు తీసుకువచ్చిన ఘనత మాజీ సిఎం కెసిఆర్‌దే అన్నారు. అన్ని రంగాలలో గజ్వేల్ నియోజకవర్గం ముందుందని, రాజస్థాన్, గుజరాత్, మహారాష్ట్రతో పాటు పలు రాష్ట్రాల నుండి భారీగా గజ్వేల్‌కు వలస వచ్చి నివాసముంటున్నారని అన్నారు. ఇంత ముందుకు పోవడానికి కారణం మాజీ ముఖ్యమంత్రి చంద్రశేఖర్‌రావు అని, ప్రస్తుతం ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వంలో గజ్వేల్ అభివృద్ధికి నయా పైసా ఇవ్వలేదని, కెసిఆర్ గతంలో అభివృద్ధికి నిధులు మంజూరు చేసిన వాటిని రాకుండా అడ్డుకున్నారని అన్నారు. అనంతరం జ్యూవెల్లరీ దుకాణ యజమాని బాబులాల్ ప్రతాప్‌రెడ్డికి మార్వాడీ టోపీ పెట్టి శాలువాతో సన్మానించి జ్ఞాపికను అందజేశారు. ఈ కార్యక్రమంలో గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపల్ చైర్మన్ ఎన్‌సి.రాజమౌళి, బిఆర్ఎస్ సీనియర్ నాయకులు గుంటుకు రాజు, గంగిశెట్టి రవీందర్, విరాసత్‌అలీ, పట్టణ బిఆర్ఎస్ అధ్యక్షుడు నవాజ్‌మీరా తదితరులు పాల్గొన్నారు.

## రామాయంపేట పట్టణ నూతన వంజరి సంఘం కార్యవర్గం ఎన్నిక

**రామాయంపేట మున్సిపాలిటీ, జులై 21, ప్రభాతవార్త :** రామాయంపేట మున్సిపాలిటీ వంజరి సంఘం నూతన కార్యవర్గాన్ని ఆదివారం నాడు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. వంజరి సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు నవాత్ రాజేంద్రప్రసాద్ ఆధ్వర్యంలో 2024-26 సంవత్సరానికి గాను వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవాలయం ప్రాంగణంలో నిర్వహించిన ఎన్నికలలో నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా నవాత్ చిన్న శ్రీనివాస్, ఉపాధ్యక్షులుగా నవాత్ నవీన్, నవాత్ ప్రసాద్, ప్రధాన కార్యదర్శిగా కాలేరు రంజిత్, సహాయ కార్యదర్శులుగా ఆముద నరేష్, సాంగని హరీష్, కోశాధికారిగా బెండె మనోహర్, సలహాదారులుగా నవాత్ నగేష్, సాంగని బస్వరాజ్, జుంగె సత్యనారాయణ, నవాత్ ప్రభాకర్, బెండె శ్రీశైలం, నవాత్ కిరణ్, కాలేరు హరికిషన్, సరిదె వెంకటేశం, పటేరు రాము, సాంగని సుధాకర్, కాలేరు ప్రసాద్ రావు, సాంగని నాగరాజులు ఎన్నికయ్యారు.

## కట్టమైసమ్మ బోనాల వేడుకల్లో చైర్మన్ శెట్కార్

**నారాయణఖేడ్ టౌన్, జులై 21, ప్రభాతవార్త:** పట్టణంలోని శ్రీ సత్యసాయి కాలనీలో కొలువున్న శ్రీ కట్టమైసమ్మ తల్లి బోనాల వేడుకలను ఆదివారం ఘనంగా జరుపుకు న్నారు. బోనాల ఉత్సవాలకు చేరుకున్న మున్సిపల్ చైర్మన్ ఆనంద్ స్వరూప్‌శెట్కార్ ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించి బోనాల వేడుకల్లో పాల్గొన్నారు. చైర్మన్‌తో పాటు కాంగ్రెస్ నాయకులు వీర్‌శెట్టి, సత్యం ఉన్నారు.

## మెరుగైన సేవలు అందించడమే లక్ష్యం

**వర్గల్, జులై 21 (ప్రభాతవార్త):** జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో వినియోగదారులకు మెరుగైన సేవలు అందిస్తున్న బ్యాంక్ ఆఫ్ బరోడా చక్కటి ప్రపంచ ఆర్థిక సంస్థగా ఎదిగినట్లు వర్గల్ శాఖ మేనేజర్ మౌనిక పేర్కొన్నారు. వర్గల్ బ్యాంక్ ఆఫ్ బరోడా కార్యాలయంలో 117వ ఆవిర్భావ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామీణ మరియు వ్యవసాయ బ్యాంకింగ్ కార్యకలాపాలతో వినియోగదారుల ప్రశంసలు పొందుతున్నట్లు స్పష్టం చేశారు. చిరు వ్యాపారులు, రైతులు, వ్యాపారాలను ఆర్థికంగా శక్తివంతం చేయాలనే లక్ష్యంతో ముందుకెళ్తున్నట్లు పేర్కొన్నారు. వ్యవసాయ, గృహ, వాహన, చిరు వ్యాపారం, ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా రుణ సేవలందించడం, క్రెడిట్ కార్డులు, డిపాజిట్‌లు, సేవింగ్స్‌పై అధిక వడ్డీ తదితర వాటిపై దృష్టి పెట్టినట్లు చెప్పారు. అయితే వినియోగదారుడికి అగ్రశ్రేణి బ్యాంకుగా సేవలు అందించడమే తమ ప్రధాన లక్ష్యమని అన్నారు. లాభదాయక, స్థిరత్వాన్ని నిర్ధారిస్తూ అభివృద్ధి చెందుతున్న వినియోగదారుల అవసరాలు తీర్చడానికి సులభమైన, సురక్షితమైన సేవలను తమ సంస్థ అందిస్తున్నట్లు పేర్కొన్నారు. . బ్యాంక్ ఆఫ్ బరోడా ఆఫీసర్స్ లకావత్ మల్సూర్, దొడ్ల వెంకటేష్, బోనగిరి రాకేష్, సిబ్బంది స్వాతి, ప్రియాంక, వినియోగదారులు గుండ విశ్వేశ్వరరావు, వర్గల్ గ్రామ మాజీ ఉపసర్పంచ్ పసుల రమేష్ ముదిరాజ్ పాల్గొన్నారు.

## ఉజ్జయిని మహంకాళి అమ్మవారికి పట్టువస్త్రాలు

**మెహిదీపట్నం, జూలై 21, ప్రభాతవార్త :** నగరంలో బోనాల ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి. ఆదివారం సికింద్రాబాద్ ఉజ్జయిని మహంకాళి అమ్మవారి బోనాల ఉత్సవాలు ప్రారంభం కావడంతో గోల్కొండ శ్రీ జగదాంబిక మహంకాళి ఆలయం నుంచి ఆలయ చైర్మన్ అరవింద్ మహేష్ కుమార్ ఆధ్వర్యంలో అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. చల్లంగా చూడుతల్లి అంటూ వేడుకున్నారు. ఈ సందర్భంగా చైర్మన్ అరవింద్ మహేష్‌కుమార్ మాట్లడుతూ..బోనాల ఉత్సవాల సందర్భంగా ప్రతి సంవత్సరం మాదిరిగానే ఈ ఏడాది కూడా ఉజ్జయిని మహంకాళి అమ్మవారికి గోల్కొండ జగదాంభిక మహంకాళి దేవాలయం నుంచి పట్టు వస్త్రాలు తేవడం జరిగిందని తెలిపారు. అదే విదంగా లాల్‌దర్వాజ అమ్మవారి దేవాలయంతో పాటు 16 దేవాలయాలకు పట్టు వస్త్రాలు అందజేస్తామన్నారు. ఆయన వెంట ఆలయ కమిటీ సభ్యులు మత్స్య రేణుక నాయకులు కార్తీక్, జగదీష్, శోభాపాండే, నరేందర్‌రెడ్డి, రాఖేష్, నరేష్, శ్రీకాంత్, సూరిలు ఉన్నారు.


పట్టువస్త్రాలను అంజేస్తున్న జగదాంబిక ఆలయ చైర్మన్ మహేష్‌కుమార్

## మనస్థాపంతో విద్యార్థిని ఆత్మహత్యాయత్నం

**ఎల్.బి.నగర్, జూలై 21 ప్రభాతవార్త:** మనస్థాపన చెందిన ఓ విద్యార్థి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. ప్రాణాపాయ స్థితిలో స్థానిక ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థిని ఆత్మహత్యకు కళాశాల యాజమాన్యమే కారణమని విద్యార్థిని తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేసున్నారు. ఈ సంఘటన చైతన్యపురి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. నాగర్ కర్నూల్ జిల్లా అచ్చంపేట మండలంచదిరుబావి తండాకు చెందిన వేణుశ్రీ ఆర్కేపురం డివిజన్ హరిపురికాలనీలోని శ్రీచైతన్య కళాశాలలో ఇంటర్‌సెకండియర్ చదువుతోంది. అయితే చదువులో తాను వెనుకబడిపోయా నని తల్లిదండ్రుల పరువు పోతుందని ఆవేదనతో కూడిన ఒక ఉత్తరాన్ని కూడా విద్యార్థిని రాసి శనివారం తను ఉంటున్న హాస్టల్‌గదిలో ఉరివేసుకొని ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. విద్యార్థిని ఆత్మహత్యకు పాల్పడుతున్న విషయాన్ని గమనించిన ఇతర విద్యార్థులు వెంటనే అక్కడికి వెళ్లి ఆమెను కాపాడారు. ఆమెను వెంటనే కొత్తపేటలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స నిమిత్తం తరలించారు.

అయితే కళాశాల యాజమాన్యం వేధింపుల కారణంగానే తమ కూతురు ఆత్మహత్య యంత్రానికి పాల్పడినట్లు తల్లిదండ్రులు, బంధువులు కళాశాల యాజమాన్యం తీరు పట్ల ఆగ్రహం వ్యక్తం చేస్తు న్నారు. విద్యార్థులను పలురకాలుగా వేధించడంవల్లే విద్యార్థులు వేధింపులు భరించలేక ప్రాణాలు తీసుకుంటున్నారని కళాశాల యాజమాన్యంపై కఠిన చర్యలు తీసుకోవాలని విద్యార్థిని తల్లిదండ్రులు బంధువులు డిమాండ్ చేస్తున్నారు. ప్రాణాపాస్థితిలో ఉన్న విద్యార్థిని గత రెండు రోజులుగా ఆసుపత్రిలో చికిత్స పొందుతోంది. కళాశాల వద్ద ఆందోళనకు దిగినవారిని పోలీసులు అడ్డుకున్నారు. కాగా తమకు ఎవరు నుంచి ఎటువంటి ఫిర్యాదులు రాలేదని పోలీసులు తెలిపారు.


మాట్లాడుతున్న కిషన్‌రెడ్డి

## బల్దియాలో బిజెపి జెండా ఎగరేయడమే లక్ష్యం

### కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి

**పంజగుట్ట, జూలై 21 (ప్రభాతవార్త):** జిహెచ్ఎంసీ ఎన్నికలలో బల్దియా జండా ఎగరవేయడమే లక్ష్యంగా భారతీయ జనతా పార్టీ క్యాడర్ ముందుకు పోవాలని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం సోమాజీగూడలో హైదరాబాద్ సెంట్రల్ జిల్లా కార్యవర్గ సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత పార్లమెంటు ఎన్నికలలో బీజేపీ క్యాడర్ సికింద్రాబాద్ నియోజక వర్గంలో బూత్‌స్థాయి నుంచి కష్టపడడం వల్లే విజయం సాధించగలిగానని అందుకు వారికి కృతజ్ఞతలు తెలుపుతున్నానన్నారు. గత ఎన్నికల్లో సికింద్రాబాద్‌లో కాంగ్రెస్ పార్టీ పేరుకే పోటీ చేసిందని బీజేపీకి వ్యతిరేకంగా ప్రచారం చేసింది మజ్లీస్ పార్టీయేనని ఆయన కార్యకర్తలకు గుర్తు చేశారు. మైనారిటీలను రెచ్చగొట్టి బీజేపీకి వ్యతిరేకంగా ప్రచారం చేయడం వల్లే నాంపల్లి, జూబ్లీహిల్స్ నియోజకవర్గాలలో కాంగ్రెస్‌కు మెజారిటీ వచ్చిందని ఆయన వ్యాఖ్యానించారు. గత కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో హైదరాబాద్ నగరంలో బాంబు పేలుళ్లు, మత కలహాలు జరిగేవని కానీ కేంద్రంలో మోదీ అధికారంలోకి వచ్చాక వాటిని పూర్తిగా నిర్మూలించడం జరిగిందని చెప్పారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ ఎనిమిది నెలల క్రితం గారడీలుచేసి అధికారంలోకి వచ్చిందని, అధికారంలోకి వచ్చిన తర్వాత ఇచ్చిన హామీలను గాలికొదిలేశారని విమర్శించారు. మహిళలకు డొక్కు బస్సుల్లో ఉచిత ప్రయాణం తప్ప మీరు చేసిందేమిటని ఆయన ప్రశ్నించారు. వందరోజులపాలన ఎజెండాగా పెట్టి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రజలను ఏవిధంగా మోసగించిందో తెలంగాణా సమాజం ఆలోచన చేయాలన్నారు. తెలంగాణా, కర్ణాటక రాష్ట్రాలలో గ్యారంటీల పేరుతో అధికారం లోకి వచ్చిన కాంగ్రెస్ ఇపుడు దివాళా తీశాయని, ఏమి చేయాలన్నా అప్పు చేయాల్సిన పరిస్థితి ఆయా రాష్ట్రాలలో నెలకొందని విమర్శించారు. జీహెచ్ఎంసీ పరిధిలో పనులేమీ జరగడంలేదని, ఏ పని చేయాలన్నా ఎమ్మెల్యేలే కమీషన్‌లు డిమాండ్ చేస్తుండడంతో కాంట్రాక్టర్‌లు ఎవరూ ముందుకు రావడం లేదన్నారు. ఒకవేళ కాంట్రాక్టర్ పనులు చేసినా సకాలంలో బిల్లులు చెల్లించడంలేదని, కానీ ముందుగానే కాంగ్రెస్‌నాయకులకు కమీషన్ ఇవ్వాల్సి వస్తుందన్నారు. కాంగ్రెస్ ఎమ్మెల్యేలు, మంత్రులు పోటీలుపడి మరీ వసూలు చేస్తున్నారని ఆయన దుయ్యబట్టారు. ఇక్కడ దోచిన సొమ్మును వేల కోట్ల రూపాయలను అధిష్టానానికి కప్పం కడు తున్నారని, కానీ ఇక్కడ అభివృద్ధి మాత్రం శూన్య మన్నారు. తెలంగాణాలో కేసీఆర్ పోయి రేవంత్ రెడ్డి వచ్చారని అదే మార్పు తప్ప ఇంకేమీలేద న్నారు. ఆ రోజు పార్టీ ఫిరాయింపుల చట్టాన్ని కేసీఆర్ తూట్లు పొడిస్తే రేవంత్‌రెడ్డి కూడా అదే బాటలో పయనిస్తున్నారని తెలిపారు. మీ రెండు పార్టీల మధ్య తేడా ఏమిటి? గాంధీ భవన్ తెలం గాణా భవన్‌లకు తేడాలేదన్నారు. మజ్లీస్ పార్టీ చెప్పు చేతల్లో ఈ రెండు పార్టీలు ఉన్నాయన్నారు. తెలంగాణా ప్రజలు మరోసారి మోసపోయి పేనం మీంచి పొయ్యిలో పడ్డారని వ్యాఖ్యానించారు. తెలంగాణా ప్రజల ఆకాంక్షలు నెరవేరాలంటే అది ఒక్క బీజేపీకే సాధ్యమన్నారు. సమావేశంలో బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు చింతల రామచంద్రా రెడ్డి, జిల్లా బీజేపీ అధ్యక్షుడు గౌతంరావు, బీజేపీ సీనియర్ నేతలు రాజశేఖర రెడ్డి, లాయక్ అలీ, అప్పారావు, అమర్‌నాధ్, రామక్రిష్ణ, ఆనంద్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## మహాకాళీ మాతకు బోనమెత్తిన లష్కర్

### అమ్మ వారికి పట్టు వస్త్రాలు సమర్పించిన సీఎం రేవంత్‌రెడ్డి... బోనం సమర్పించిన మంత్రులు పొన్నం, సీతక్క తదితరులు









**బేగంపేట జూలై 21, ప్రభాతవార్త :** ఆషాడ మాసం వచ్చిందంటే చాలు అమ్మకు బోనం సమర్పించేందుకు భక్తులు ఆలయానికి పోటెత్తుతారు. సికింద్రాబాద్ శ్రీఉజ్జయినీ మహాకాళీ ఆషాడ జాతరలో భాగంగా ఆదివారం సికింద్రాబాద్ శ్రీఉజ్జయినీ మహాకాళీ అమ్మ వారికి లష్కర్ ప్రజలు బోనం సమర్పించేందుకు తెల్లవారు ఝామునుంచే ఆలయానికి క్యూ కట్టారు. తెల్లవారు ఝామున మంత్రి పొన్నం ప్రభాకర్ బంగారు తొలి బోనం, పట్టు వస్త్రాలు సమర్పించి ప్రత్యేక పూజలు చేసారు. సిఎం రేవంత్‌రెడ్డి అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించారు. వీరితోపాటు హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయ, కుమార్తె విజయలక్ష్మిలు అమ్మ వారిని దర్శించుకుని పూజలు నిర్వహించగా, కేంద్రమంత్రి గంగాపురం కిషన్‌రెడ్డి దంపతులు అమ్మవారికి బోనం సమర్పించారు. సీఎస్ శాంతికుమారి, మంత్రి సీతక్క తదితరులు అమ్మవారికి బోనాలు సమర్పించారు. వీరంతా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారంతా రాష్ట్రంలో వర్షాలు సమృద్ధిగా కురవాలని, రైతులు పాడి పంటలతో ప్రజలు సుఖ శాంతులతో వర్ధిల్లాలని కోరుకున్నారు. గడచిన రెండు రోజులుగా వర్షం కురుస్తున్నప్పటికీ తెల్లవారు ఝామునుంచి అమ్మ వారిని దర్శించుకునేందుకు రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలతో పాటు ఇతర రాష్ట్రాలు, దేశాల నుంచి వచ్చిన భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా ఆలయం వద్ద పోతురాజుల విన్యాసాలు, శివసత్తుల నృత్యాలు, డప్పు చప్పుళ్లు, ఫలాహారం బండ్ల ఊరేగింపుల కోలాహలంతో సందడి వాతావరణం నెలకొంది. భక్తులు పెద్ద సంఖ్యలో క్యూలైన్లలో అమ్మ వారి దర్శనం కోసం వేచి ఉన్నారు. దీంతో ఆలయం వద్ద ఆధ్యాత్మిక శోభ వెల్లి విరుస్తుంది. భక్తులు అమ్మ వారిని దర్శించుకునేందుకు మొత్తం 6 క్యూలైన్లు ఏర్పాటు చేసారు. వాటిలో రెండు క్యూలైన్లు బోనాలతో వచ్చే వారికోసం మరో రెండు లైన్లు పాసులు ఉన్న వారికోసం ఇంకోక రెండు లైన్లు సాధారణ భక్తుల కోసం కేటాయించారు. అయితే బల్కంపేట ఎల్లమ్మ ఆలయం వద్ద క్యూలైన్లలో రద్దీ తోపులాట జరిగిన ఘటనలను దృష్టిలో ఉంచుకొని మహాకాళీ ఆలయం వద్ద అధికారులు పలు రకాలైన ముందస్తు జాగ్రత్తలు పాటించారు. హైదరాబాద్ కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి ఆలయం వద్ద ఏర్పాట్లను పర్యవేక్షించారు. నగర పోలీస్ కమీషనర్ కొత్తకోట శ్రీనివాసరెడ్డి నేతృత్వంలో నార్త్‌జోన్ డీసీపీ సాధన రష్మీ పెరుమాళ్ ఆలయం వద్ద భద్రతా ఏర్పాట్లను పర్యవేక్షించారు. దేవాదాయ శాఖ ఉన్నతాధికారులు ఆలయం వద్దే ఉండి పరిస్థితులను ఎప్పటికప్పుడు పర్యవేక్షించారు. ఆలయం సమీపంలోని వివిధ ప్రాంతాల్లో ఉచిత వైద్య శిబిరాలు ఏర్పాటు చేసారు. క్యూలైన్లలో వస్తున్న భక్తుల కోసం తాగునీటిని క్యూలైన్ల పొడవునా అందించారు. మహంకాళీ పోలీస్‌స్టేషన్‌లో కమాండ్ కంట్రోల్ రూం ఏర్పాటు చేసి అనుక్షణం పరిస్థితులను పర్యవేక్షించారు. అత్యవసర పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని ఫైర్ సిబ్బంది సేఫ్టీ పరికరాలను అందుబాటులో ఉంచారు. జీహెచ్ఎంసీ పారిశుధ్య కార్మికులు ఎప్పటి కప్పుడు ఆలయ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచారు. ఆలయాన్ని వివిధ రకాలైన రంగు రంగుల పూలతో అందంగా అలంకరించడంతోపాటు వివిధరంగుల విద్యుద్దీపాలను ఏర్పాటు చేయడంతో ఆలయం దేదీప్యమానంగా వెలుగులు నింపుకుంది. పది గంటలు దాటిన తరువాత కొద్దిసేపు క్యూలైన్లు ఖాళీగా కన్పించాయి. గురుపౌర్ణమి కావడం, ఉదయం నుంచి మబ్బులు అలుముకుని వర్షం పడుతుండటంతో ఆలయానికి వచ్చేక్యూలైన్లు బోసిపోయాయా అన్న సందేహాలు వ్యక్తమయ్యాయి. ఆలయానికి వచ్చిన భక్తులకు సేవలు అందించడంలో దక్కన్ మానవ సేవా సమితితో పాటు స్కౌట్స్ అండ్ గైడ్స్, ఎన్ సీ సీ, మక్తాల ఫౌండేషన్ తదితర స్వచ్ఛంద సంస్థలు ఆలయం వద్ద సేవలు అందించాయి. పలు స్వచ్ఛంద సేవా సంస్థల ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు.


బోనాలను తీసుకెళుతున్న దృశ్యం

**అమ్మ వారిని దర్శించుకున్న ప్రముఖులు...**

సికింద్రాబాద్ శ్రీఉజ్జయినీ మహాకాళీ అమ్మ వారిని ఆదివారం ఆషాడ బోనాల జాతర సందర్భంగా పలువురు ప్రముఖులు సందర్శించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రులు పొన్నం ప్రభాకర్ గౌడ్, సీతక్క, రాజ్యసభ సభ్యులు అనిల్‌కుమార్ యాదవ్, డా.కె.లక్ష్మణ్, ఎంపీ ఈటెల రాజేందర్, సీఎస్ శాంతికుమారి, జీహెచ్ఎంసీ కమీషనర్ కాటా ఆమ్రాపాలి, నగర పోలీస్ కమిషనర్ కొత్తకోట శ్రీనివాసరెడ్డి, శైలజారామయ్యర్, డిప్యూటీ మేయర్ మోతే శ్రీలతా శోభన్‌రెడ్డి, మాజీ మంత్రి చామకూర మల్లారెడ్డి, ఎమ్మెల్యేలు దానం నాగేందర్, శ్రీగణేష్, ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ తదితరులు అమ్మ వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.


పూజలు చేస్తున్న మంత్రి సీతక్క


నగర పోలీస్ కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి


పూజలు చేస్తున్న హర్యానా గవర్నర్ దత్తాత్రేయ

## కంకర తేలి..మట్టి పేరుకుపోయి...

- పూర్తిగా పాడైపోయిన వరంగల్ జాతీయ రహదారి
- ఉప్పల్, బోడుప్పల్, ఫిర్జాదిగూడ, అంబర్‌పేట అంతర్గత రోడ్లు మరీ అధ్వానం
- మరమ్మతుల పేరుతో రూ. కోట్లలో వ్యయం అయినా మారని దుస్థితి
- రాత్రిపూట ప్రమాదాలకు గురవుతున్న వాహనదారులు

**హైదరాబాద్, జూలై 21 ప్రభాతవార్త :** నగరం బురదమయంగా మారి విశ్వనగరంగా తీర్చిదిద్దే హైదరాబాద్‌లోనే ఉన్నామా? అన్న అనుమానం కలగిస్తోంది. భారీ వర్షాలకు మహానగర రహదారులు ఎప్పటిలాగే ఛిద్రమయ్యాయి. వందలకోట్లు ఖర్చు పెట్టినా పరిస్థితిలో మార్పు కాలేదు. గ్రేటర్ లో 9,103 కి.మీల రహదారులున్నాయి. నగరంలో కురుస్తున్న వర్షాలకు చాలా రోడ్లు గుంతలమయంగా మారడంతోపాటు వరదనీటితో కొట్టుకు వచ్చిన మట్టి మేట వేసింది. ఒక వైపు గుంతలు, మరోవైపు మట్టి, కంకర ఉండడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పట్టుమని పది మీటర్లు కూడా కుదుపులేని ప్రయాణం నగర రోడ్లపై సాగే పరిస్థితి లేదు. ప్రభుత్వం అధిక ప్రాధాన్యతనిస్తోన్న ఐటీ కారిడార్‌లోని గచ్చిబౌలి, కొండాపూర్, మాదాపూర్, లింగంపల్లి ప్రాంతాల్లో రోడ్లపై ప్రయాణం నరకప్రాయంగా మారుతోంది. ఔటర్ రింగ్ రోడ్డు, శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయానికి ఈ మార్గంలో వెళ్లే ప్రజలు అవస్థలు పడుతున్నారు. కర్మన్‌ఘాట్, చంపాపేట, చాంద్రాయణగుట్టల మీదుగా శంషాబాద్‌కు వెళ్లే వారికీ అదే దురవస్థ, చేరుకోవాల్సిన గమ్యస్థానానికి వెళ్లేందుకు పాడైన రహదారుల వల్ల సమయ బారం పడుతోంది. ఎలివేటెడ్ కారిడార్ పనులు జరుగుతున్న ఉప్పల్, బోడుప్పల్, ఫిర్జాదిగూడ మీదుగా వరంగల్ జాతీయ రహదారి పూర్తిగా రోడ్డు పాడైపోయింది. ఇక నల్లచెరువు రోడ్డు పరిస్థితి మరింత అధ్వాన్నంగా తయారైంది. అంబర్‌పేట నుంచి రామంతాపూర్, చింతల్‌కుంట నుంచి హయత్‌నగర్, సైదాబాద్ నుంచి ఒవైసి చౌరస్తా వరకు, శివరాంపల్లి నుంచి జూపార్కు వరకు, ఫ్లైఓవర్ల పనులతో దారులు అధ్వాన్నంగా మారాయి. ఇక్కడి రహదారులు వాహనదారులకు నరకం కనిపిస్తోంది. ఎన్‌ఎండిసి నుంచి సరోజిని దేవి ఆస్పత్రి మార్గంలో ఒకవైపు దారి గుంతలమయంగా మారింది. బైరంపేటలో దెబ్బతిన్న రహదారుల్లో వరినాట్లు వేసి బిజెపి నాయకులు నిరసన తెలిపారు. గుడిమల్కాపూర్ నుంచి అత్తాపూర్ వరకు పివిఎక్స్‌ప్రెస్‌వే మార్గంలో రహదారిపై పలుచోట్ల ఇసుక మేట వేసింది. జిహెచ్ఎంసి అధికార లెక్కల ప్రకారం రహదారుల నిర్మాణం, నిర్వహణ(వంతెనలు, అండర్‌పాస్‌లు కాకుండా)కు కోట్లు కుమ్మరిస్తున్నా మహానగరంలో రహదారుల పరిస్థితి మెరుగుపడడంలేదు.

ఐదు నెలల క్రితం నిర్మించిన రహదారులపైనా పలు ప్రాంతాల్లో గుంతలు పడి, కంకర తేలాయి. ఇక శివారు ప్రాంత ఫిర్జాదిగూడ, బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్లలో కంకరతేలి మోకాల్లోతు గుంతలు ఏర్పడ్డాయి. ఇటీవల కురుస్తున్న వర్షాలతో గ్రేటర్ పరిధిలోని వారాసిగూడ, సీతాఫల్ మండి, చిలకలగూడ, రాంనగర్, రాజేంద్రనగర్, అలీనగర్, అంబర్‌పేట, రాజేంద్రనగర్, ఉప్పల్ నల్లచెరువు నుండి అంబర్‌పేట వరకు ఏర్పడిన గుంతలను పూర్చడం లేదని పలువురు పేర్కొంటున్నారు. దీంతో ఆయా ప్రాంతాలల్లో ట్రాఫిక్ సమస్య ఏర్పడుతోంది. నగర శివారు ప్రాంతాలు నిజాంపేట, దుండిగల్, మణికొండ మున్సిపాలిటీల ప్రాంత రహదారుల్లో పరిస్థితి మరీ అధ్వాన్నంగా మారింది. తాగునీటి, డ్రైనేజీ పైపులైన్ల కోసం తవ్విన రోడ్లను పునరుద్దరించలేదు. వర్షాలు వస్తున్నాయంటే నీరు నిలిచి రోడ్లు పొడవుతున్నాయని అధికారులు చెబుతున్నారు. ఇందులో కొంత వాస్తవం ఉన్నా..శాస్త్రీయ విధానంలో రోడు నిర్మించక పోవడమే వరద నీరు నిలిచేందుకు ప్రధాన కారణమని ఇంజనీరింగ్ నిపుణులు చెబుతున్నారు. ఇండియన్ రోడ్ కాంగ్రెస్ ప్రమాణాల ప్రకారం రోడ్డు మధ్యలో ఎత్తుగా ఉండి, పక్కలకు ఏటవా లుగా ఉండాలి. కానీ కార్పెటింగ్, రీ కార్పెటింగ్ ప్యాచ్ వర్క్‌ల పేరిట ఇష్టానికి బీటీ మిక్సింగ్ వేయడంతో చాలా ప్రాంతాల్లో ఎగుడు దిగుడుగా రమదారులు కనిపిస్తాయి. దీంతో స్ట్రామ్ వాటర్ డ్రెయిన్లు ఉన్న వాటిలోకి వర్షపు నీరు వెళ్లే పరిస్థితి చాలా ప్రాంతాల్లో లేదు. రోడ్ ప్రొఫైల్ సరిగా లేకపోవడమూ రోడ్డు పాడవడానికి కారణమవుతున్నాయని నిపుణులు అభిప్రాయం.



## ఎడతెరిపి లేని ముసురు

- భారీ వర్షాలకు జనజీవనం అస్తవ్యస్తం
- రెండు రోజుల నుండి బస్తీలలో నరకయాతన
- వర్షపునీరు పోయే మార్గాలు లేక నీళ్లలోనే బస్తీలు..
- ప్రధాన రహదారులలో సైతం మోకాలిలోతు వరకు నిలిచిన నీరు
- ఎక్కడ చూసినా బారులు తీరిన వాహనాలు
- విపరీతమైన ట్రాఫిక్ జామ్‌లు..
- తెరుచుకున్న మ్యాన్‌హోళ్లు మూసే నాధుడే లేడు..
- చేష్టలుడిగి చూస్తున్న అధికార యంత్రాంగం..





**పంజగుట్ట, జూలై 21 (ప్రభాతవార్త):** రెండు రోజులుగా ముసురు పట్టడంతో నగర వ్యాప్తంగా దాదాపు జనజీవన పరిస్థితులు దుర్భ రంగా మారాయి. ముఖ్యంగా పంజగుట్ట, సోమాజీగూడ, బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, ఫిలింనగర్, యూసుఫ్ గూడ, బోరబండ, రహ్మత్‌నగర్ లాంటి ప్రధాన ప్రాంతాలలో ఇబ్బందులు చెప్పనలవి కాకుండా తయారయ్యాయి. ఎక్కడ చూసినా నీళ్లు, పొంగిపొర్లుతున్న డ్రైనేజీలు, రోడ్లపై ముఖ్యంగా ఇళ్ళముందు మురికినీరు నిలిచిపోయిన దృశ్యాలే కనిపించాయి. శుక్రవారం రాత్రి నుండి ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షానికి పలు రహదారులు ధ్వంసంకాగా బస్తీలలో గుడిసెలు నేలమట్టానికి సిద్ధంగా తయారయ్యాయి. ఎడతెరిపిలేకుండా వరద బీభత్సం కొనసాగుతుండడంతో రహదారులన్నీ చిత్తడిచిత్తడిగా తయారయ్యాయి. ముఖ్యంగా లోతట్టు ప్రాంతాలన్నీ జలమయమయ్యాయి. వివిధ శాఖల మధ్య సమన్వయ లోపం అన్ని ప్రాంతాలలో స్పష్టంగా కనిపిస్తోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తాము హైదరాబాద్ నగరం లో ఉంటున్నామా లేక అడవులలో ఉంటున్నామా అర్థం కావడం లేదని ఫిలింనగర్ మురికివాడకు చెందిన వెంకటరమణ అనే కూలీ వ్యాఖ్యానించాడంటే అక్కడ పరిస్థితులు ఏవిధంగా ఉన్నాయో అర్థం చేసుకోవచ్చు. ప్రధాన రహదారులలో సైతం వర్షపు నీరు నిలిచిపోవడంతో మ్యాన్‌హోళ్లను తెరిచి ఉంచుతున్నారు. తర్వాత వాటిని మూసివేయకపోవడంతో ప్రమాదాలు జరుగుతాయోమోనని వాహనదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పంజగుట్ట ప్రధాన రహదారిలోని మోడల్‌హౌస్ ప్రాంతంలో ఓ మ్యాన్‌హోల్ గడిచిన రోజంతా తెరిచే ఉంది. రోజూ వేలాది వాహనాలు తిరిగే ప్రాంతంలో తెరిచ ఉన్న మ్యాన్‌హోల్‌లో పొరపాటున ఏ వాహనమైనా పడితే తీవ్ర ఇబ్బందులు జరిగే అవకాశం ఉందని ఆ రహదారిలో ప్రయా ణించే ఓ వాహనదారుడు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విధంగా చాలా ప్రాంతాలలో మ్యాన్‌హోళ్ల నోళ్లు తెరిచే ఉంటున్నాయి. తెరిచి మ్యాన్‌హోల్ వద్ద ఏదైనా గుర్తు సూచించే ఓపిక కూడా కింది స్థాయి సిబ్బందికి లేకుండా పోతున్నదనే విమర్శలు సర్వత్రా వినబడుతున్నాయి. భారీ వర్షాలకు ప్రధాన రహదారులన్నీ జలమయమవడంతో ఎక్కడ చూసినా వాహనాలు బారులు తీరి ట్రాఫిక్ లో చిక్కుకుపోయాయి. శనివారం సాయంత్రం అమీర్‌పేట నుండి కేపీహెచ్‌బీ కాలనీ వరకు ప్రధాన రహదారిలో ప్రయాణించడానికి రెండు గంటల సమయం పట్టింది. ఓవైపు భారీ వర్షం, మరోవైపు నిలిచిపోయిన వాహనాలతో వాహనదారులు నానా అవస్థలు పడ్డారు. జీహెచ్ఎంసీ, వాటర్ వర్క్స్, ట్రాఫిక్ సిబ్బంది సమన్వయంతో వ్యవహ రించి ఎక్కడ సమస్య ఉంటే అక్కడకు చేరుకుని సమస్య పరిష్కరించవలసిన అవసరం ఎంతైనా ఉందని స్థానికులు అంటున్నారు.

**వర్షాలతో విష జ్వరాల బెడద...**

నగరంలో కురుస్తున్న భారీ వర్షాల కారణంగా గత మూడు రోజుల్లోనే వైరల్ జ్వరాలు అకస్మాత్తుగా పెరిగాయి. వర్షాలతో దోమల వ్యాప్తి చెంద డంతో నగరవాసులు మలేరియా, డెంగ్యూ, చికెన్ గున్యా, డిఫ్తీరియా బారిన పడుతున్నారని ఈ రకమైన కేసులే తమవద్దకు ఎక్కువగా వస్తున్నా యని అమీర్‌పేటకు చెందిన ప్రైవేట్ ప్రాక్టీషనర్ ఒకరు తెలిపారు. శరీర ఉష్ణోగ్రతలు పెరగడం, దగ్గు, జలుబు లక్షణాలతో ఆసుపత్రుల ముందు జనాలు క్యూకడుతున్నారు. ఆసుపత్రులలో సాధా రణ రోజులలో కంటే ఓపీలు రోజుకు మూడింతలు ఎక్కువగా నమోదవుతున్నాయి. నగరవ్యాప్తంగా వైరస్ బారినపడ్డ అనుమానిత కేసులు నమోదవు తున్నాయని నిమ్స్ ఆసుపత్రికి చెందిన ప్రముఖ జనరల్ మెడిసిన్ వైద్య నిపుణుడు ఒకరు వ్యాఖ్యా నించారు. కొందరిలో జ్వరలక్షణాలు కనిపిస్తుండగా మరికొందరిలో తలనొప్పి, వంటి నొప్పి వంటి లక్ష ణాలు కనిపిస్తున్నాయని వైద్యులు అంటున్నారు. మరికొన్ని రోజులు వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున నగర వాసులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, ఇంట్లోకి దోమలు చేరకుండా చూసు కోవాలని ముఖ్యంగా చిన్న పిల్లల విషయంలో తల్లిదండ్రులు జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యులు హెచ్చరిస్తున్నారు.